# మిసిమి


మాస పత్రిక

ఏప్రిల్ - 2004



రూ. 8/-

## చిత్రకారుని గురించి



### మాధవ్ సత్వాల్‌కర్

జననం - 13 ఆగష్టు, 1915, లాహోర్‌లో,

J.J. స్కూలు ఆఫ్ ఆర్ట్స్ బొంబాయిలో 1935లో ఉత్తీర్ణత.

మాయొ మెడల్ బహూకరణ - 1935లో

చిత్రలేఖనంలో ఉన్నత విద్యాభ్యాసం-1937లో

1937-40 వరకూ విదేశాలలో చిత్రలేఖాభ్యాసం.

ఫ్లొరన్స్ అకాడమీ - ఫ్లొరన్స్ (ఇటలీ)

స్లేడ్ స్కూలు - లండన్ (ఇంగ్లండు)

గ్రాండ్ అకాడమి - పారిస్ (ఫ్రాన్స్)

ఇండియన్ ఆర్ట్ ఇనిస్టిట్యూట్ ప్రారంభకులు - 1955

బొంబాయి ఆర్ట్ సొసైటీ ఛైర్‌మెన్ - 1962 - 68

ఫెడరేషన్ ఆఫ్ ఆర్ట్ ఇనిస్టిట్యూషన్స్ - 1960 - 69

మహారాష్ట్ర రాష్ట్రపు ఆర్ట్ డైరక్టర్ - 1969 - 75

**ముఖచిత్రం: విలాసం**

మూడవ నాల్గవ అట్టలపై చిత్రాలు కూడా వీరివే...

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 15 | ఏప్రిల్ 2004 | సంచిక 4

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక


ఇరవయ్యో శతాబ్ది మనస్సు గతి - IV — అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ప్రాకృతిక వాదం - ఆదర్శవాదం — మూలం : రూడోల్ఫ్ యూకెన్, అనువాదం : బి.వి.రామిరెడ్డి

చరిత్రకారునిగా కంభంపాటి సత్యనారాయణ (21వ వర్ధంతి సందర్భంగా 16-1-2004న స్మారకోపన్యాసం) — టి. రవిచంద్

చిత్రకళలో ఉత్తమోత్తమ శైలులను ఔపోశన పట్టిన అగస్త్యుడు - మాధవ్ సత్వాల్కర్ — కాండ్రేగుల నాగేశ్వరరావు

కొలంబియమ్ పట్ల కుతూహలం — డా॥ చాగంటి కృష్ణకుమారి

సమసమాజంలో మానవాత్మ — మూలం : ఆస్కార్ వైల్డ్, అనువాదం : సర్దేశాయి తిరుమల రావు


విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **"విలాసం"**

చిత్రకారుడు : **మాధవ్ సత్వాల్కర్**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

## 'మిసిమి' బుద్ధజయంతి ప్రత్యేక సంచికకు

# రచనల ఆహ్వానం

బౌద్ధాన్ని భారతదేశం తరిమేసి పంపి మహాపాపం చేసిందన్నాడు గురజాడ. కాని కొంతమంది పండితమ్మన్యులు ''బౌద్ధం ఎక్కడికీ పోలేదు, భారతదేశంలో జీర్ణించుకు పోయింది.'' అంటారు లోతుగ చూడ కుండానే. మూల బౌద్ధానికి ఆత్మలేదు, సృష్టి కర్త అయిన దేవుడు లేడు, కర్మకాండ క్రతువులు లేవు. ఇవన్నీ హిందూ మతంలో ఉన్నాయి. ఇవి ప్రాథమిక విషయాలు, ఇవి లేకపోతే బౌద్ధం భారతదేశంలో ఎక్కడ ఉన్నట్లు? మరి హిందూ మతం వీటిని అంగీకరిస్తుందా?

★ ★ ★ ★ ★

ప్రపంచం అంతా నిద్దరోతోంది. నడి రేయి సిద్ధార్థ గౌతముడు నిద్రమేల్కొన్నాడు. మహాభినిష్క్రమణం చేశాడు. ప్రపంచం సనాతన సంప్రదాయాలలో, కర్మకాండలో వర్ణ వ్యవస్థలో జోగుతోంది. సిద్ధార్థుడు మేల్కొన్నాడు బుద్ధుడయ్యాడు. ప్రపంచాన్ని పెను నిద్ర నుంచి తట్టి లేపాడు.

★ ★ ★ ★ ★

బుద్ధుడు మానవవాది, అనుభవికవాది, సంస్కరణ వాది, స్వతంత్ర వాది. బౌద్ధంలో ఎన్నో అంశాలు ఆధునిక ప్రపంచ గందరగోళానికి ఊరట గలిగించేవిగా ఉన్నాయి.

''ఆధునిక ప్రపంచానికి బౌద్ధం'' అనే అంశాన్ని మనసులో ఉంచుకొని రచయితలు తమ వ్యాసాలను ఏప్రిల్ 10తేదీ లోగా 'మిసిమి'కి చేరేట్టు పంపాలని కోరుతున్నాము.

- సంపాదకుడు

### *దిద్దుబాటు*

మార్చి నెల విషయసూచికకు బదులు ఫిబ్రవరి నెల విషయసూచిక ముద్రింప బడినందుకు చింతిస్తున్నాము. ఈ క్రింది విధంగా సవరించుకోగలరు.


ఇరవయ్యో శతాబ్ది మనస్సు గతి - III — అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ప్రప్రథమ నోబెల్ సాహిత్య బహుమతి గ్రహీత - సల్లీప్రుడ్ హోమ్ — మూలం : సి.డి. అఫ్ విర్‌సెన్, అనువాదం : అనిపెద్ది వెంకటరమణరావు

విజేతలు ఇలా ఉంటారు ! — సి. వి. సర్వేశ్వరశర్మ

చరిత్రకారునిగా కంభంపాటి సత్యనారాయణ (21వ వర్ధంతి సందర్భంగా 16-1-2004న స్మారకోపన్యాసం) — టి. రవిచంద్

చిత్రకారునిగా - హిట్లర్ — కాండ్రేగుల నాగేశ్వరరావు

సమసమాజంలో మానవాత్మ — మూలం : ఆస్కార్‌వైల్డ్, అనువాదం : సర్దేశాయి తిరుమల రావు


- సంపాదకుడు

# ఇరవయ్యో శతాబ్ది మనస్సు గతి IV

- అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

మానవ వాద మూర్తిమత్వ సిద్ధాంత కర్తలు చాలమంది ఉన్నారు. వారి వారి సిద్ధాంతాల మధ్య కొంత భేదం ఉన్నా కొంత సామ్యం లేకపోలేదు. వారి సిద్ధాంతాలన్నీ ముఖ్యంగా, స్వయం నిర్దేశకత self directionను, ఎంపిక స్వేచ్ఛను freedom of choiceను నొక్కి చెబుతాయి. ఇవన్నీ ఆత్మ అంటే selfను వ్యక్తి ఆత్మగత అనుభవాలను నొక్కి చెబుతాయి. వ్యక్తి పెరుగుదల growth ను, ఆత్మ యథార్థీకరణాన్ని అంటే self actualisation నొక్కి చెబుతాయి.

ఈ మానవ వాద మూర్తిమత్వ సిద్ధాంత ప్రముఖులలో ఒకరు కారల్ రోజర్స్. ఇతని సిద్ధాంతంలో ముఖ్య భావన ఆత్మభావన self. 'నేను' లేదా 'నన్ను' అనేదానిని నిర్వచించే భావాలు, సంజ్ఞలు, విలువలు ఇందులో ఉంటాయి. ఇందులో నేనేమిటి? నేనెవరిని? నేనేమి చేయగలను? అనేవి గూడ ఉంటాయి. ఈ విధంగా తాను రూపొందించుకొన్న ఆత్మ అంటే తాను ఏర్పరచుకొన్న 'ఆత్మ ప్రతిమ' 'self image' తిరిగి ఆవ్యక్తి ప్రపంచాన్ని దర్శించేటప్పుడు, అర్థం చేసుకొనేటప్పుడు, తన ప్రవర్తనను తాను అంచనా వేసుకొనేటప్పుడు, అతనిని ప్రభావితం చేస్తుంది. ఒక బలమైన ఆత్మ భావన ఉన్న వ్యక్తి ప్రపంచాన్ని చూడడానికి ఒక బలహీనమైన ఆత్మ భావన ఉన్న వ్యక్తి ప్రపంచాన్ని దర్శించడానికి మధ్య ఎంతో తేడా ఉంది.

ఎవరైన వారి వారి ఆత్మభావనలకు అనుగుణంగా, తాము అనుభవించే అనుభవాలకు విలువ కడతారు. తన ఆత్మ భావన కనుగుణంగానే ఒక వ్యక్తి ప్రవర్తించాలనుకొంటాడు. పొసగని అనుభవాలు, అనుభూతులు భయ పెడతాయి. చేతనంలోకి వాటికి ప్రవేశం ఉండదు. ఈ ప్రవేశం లేక పోవడాన్ని ఫ్రాయిడ్ దమనం repression అన్నాడు. ఆత్మ భావనకు అనుభవాలకు మధ్య పొంతన లేక పోతే, అతడు వ్యాకుల చిత్తుడవుతాడు. ఆరోగ్య కరమైన వ్యక్తి ఆత్మభావన అనుభవాల మధ్య సమరసం ఉంటుంది. అతనిలో ఆత్మభావన ఘనీభవించకుండ, కొత్త భావాలను, అనుభవాలను సమన్వయం చేసుకొంటూ తదనుగుణంగా మారుతుంది.

రోజర్ సిద్ధాంతంలో ఇంతవరకు మనం చెప్పుకొన్న 'ఆత్మ' కాక మరో 'ఆత్మ' ఉంది. ఇది ఆదర్శ ఆత్మ ideal self. మనందరికీ ఆదర్శాలుంటాయి. 'నేను' ఫలాన విధంగా ఉండాలి, ఫలాన విధంగా తయారు కావాలి', అని ప్రతి ఒక్కరం అనుకొంటాం. ఏమి కావాలని మనం కోరుకొంటున్నామో అదే మన 'ఆదర్శాత్మ' ideal self. దీనినే ఫ్రాయిడ్ 'అహం ఆదర్శం' ego ideal అన్నాడు. ఈ రెండు ఆత్మల మధ్య దూరం ఎక్కువైతే అతడు అసంతోషకర దుఃఖ భాగుడవుతాడు.

మానవ జీవిని ముందుకు తోసేది నడిపేది, ప్రేరేపించేది ఆత్మ యథార్థీకరణం self actualisation. ఆత్మ యథార్థీకరణం అంటే తనలోని బీజరూప శక్తులను వెలికి తెచ్చి, పండించుకొనే

సిద్ధింప జేసుకొనే, సాఫల్యం చేసుకొనే ప్రవృత్తి; అంతే కాదు, జీవిని కొనసాగించే ప్రవృత్తి. ఈ ఆత్మ యథార్థీకరణ ప్రవృత్తి తరచు రెండు రకాల అవసరాలతో ఘర్షణ పడుతుంది. ఒకటి సకారాత్మక సమ్మానావసరం. అంటే మనందరం ఇతరులతో సమ్మానించ బడాలని. అభిమానించ బడాలని, ప్రేమించ బడాలనీ కోరుకొంటాం. దీనిని positive regard అంటారు. ఈ అభిమానం షరతులతో కూడింది కావచ్చు, షరతులు లేనిది కావచ్చు. తల్లి ప్రేమ షరతులు లేనిది. నీవు మంచిగా ఉంటే నిన్ను గౌరవిస్తాం, ఇది షరతులతో గూడినగౌరవం. రెండోది ఆత్మ సమ్మానావసరం self regard. ఇది ఇతరులు ఆమోదించిన, మెచ్చుకొన్న చర్యలను, విలువలను, దృక్పథాలను అంతరీకరణం చెందించుకొని, తన ఆత్మ భావనలోకి రంగరించుకోవడం. ఈ అర్థంలో ఇది ఫ్రాయిడ్ సూపర్ ఈగోకు సమానం. ఒక అనుభవం తన 'వ్యక్తి' ని పెంచుతుందా, లేక దిగజారుస్తుందా అనే దాని మీద ఆధారపడి చర్యలు జరపాలని, వ్యక్తిని ఆత్మ యథార్థీకరణం ముందుకు నడుపుతుంది. ఇతరుల నుంచి, ముఖ్యంగా వ్యక్తి జీవితంలో ముఖ్యమనుకొన్న వారి నుంచి, అనుకూల ప్రతిస్పందన రాబడుతుందా లేదా అనే దాని మీద ఆధారపడి, సకారాత్మక సమ్మానావసరం వ్యక్తి ప్రవర్తనను నిర్దేశిస్తుంది. అయితే కొన్ని సందర్భాలలో ఈ రెండింటి మధ్య వైరుధ్యం ఉండక పోదు.

వ్యక్తికి సకారాత్మక సమ్మానం లభించినట్లైతే - సమ్మానం షరతులతో కూడినది కాకపోతే, - అతని ఆత్మ భావన - వాస్తవానుభవాల మధ్య, అతని ఆత్మభావన ఆదర్శ ఆత్మల మధ్య, మంచి సమరసం ఉంటుంది. అలా ఉంటేవ్యక్తి ఆరోగ్య వంతంగా ఉంటాడంటాడు రోజర్స్.

ఫ్రాయిడ్, ఇడ్‌ని అంతరాత్మలను నొక్కి చెబితే నవ్య ఫ్రాయిడియన్ అయిన ఎరిక్. హెచ్. ఎరిక్‌సన్ ఈగో చాల ముఖ్యమైందంటాడు. ఈగో అనేది ఎరిక్ సన్ ప్రకారం వ్యక్తి - సమాజాల సంబంధాలలో ముఖ్య పాత్ర వహిస్తుంది. అందుకని వ్యక్తిలోని సహజాతాలు ఎంత ముఖ్యమో, వ్యక్తి పెరిగే సమాజం గూడ అంత ముఖ్యమైందే.

ఎరిక్ సన్ ఫ్రాయిడ్ భావనలలో చాల భాగాన్ని ఒప్పుకొన్నాడు. పిల్లవాని మూర్తిమత్వానికి, అతని రూపు రేఖలు దిద్దే సామాజిక విలువలకు, సమాజ నియమాలకు మధ్య ఏర్పడే 'ఘర్షణ' కు ప్రాముఖ్యం ఇవ్వాలంటాడితడు. సహజాతాలు పిల్లలందరిలోనే ఒకేవిధంగా ఉంటాయి. కాని విలువలే సమాజానికి సమాజానికి మారుతూ ఉంటాయి. అంతే కాదు, సామాజిక సంస్కృతులు పెరుగుతూ మారుతూ ఉంటాయి. వ్యక్తి పరిణతి చెందడంలో ఫ్రాయిడ్, యూంగ్‌లు గతానికి ప్రాముఖ్యం ఇస్తే, ఆడ్లర్‌కులాగ, ఇతడు భవిష్యత్తును నొక్కి చెప్పాడు. కాలంలో, ఏ క్షణంలోనైనా, అతని భావి ఆశంసలు, ఆకాంక్షలు, అతని ''ఇప్పటి ఇక్కడి'' ప్రవర్తనను నిర్ణయిస్తాయి.

ఒక వ్యక్తి పూర్తిగా పరిణత చెందడానికి, అతడు ఎనిమిది వికాస దశల గుండ పయనించవలసి ఉందంటాడు ఎరిక్ సన్. ప్రతి వికాస దశలోను అతడు ఒక సంకట స్థితిని, ఒక ఘర్షణను

ఎదుర్కొంటాడు. ఈ సంకట స్థితి, ఘర్షణలు ఆ దశను నిర్వచిస్తాయి. వ్యక్తి శీలానికి ఈ ఎనిమిది సంకట స్థితులు ఎనిమిది పరీక్షలవుతాయి.

ఇతడు మొదటి వికాసదశను 'సంవేదకదశ' 'sensory stage' అన్నాడు. ఈ దశలో బిడ్డ నిష్క్రియాత్మకంగా ఉండి తన చుట్టూ ఉన్న ప్రపంచం నుంచి ఎంతో గ్రహిస్తాడు. ఈ దశ ఫ్రాయిడ్ చెప్పిన మౌఖిక దశకు సరిపోతుంది. ఈ దశలో బిడ్డ ఎదుర్కొనే 'సంకటస్థితి' ఘర్షణ ఏమిటంటే ఇతరుల మీద నమ్మకం ఉంచడం, ఉంచక పోవడం అన్న విషయాన్ని నేర్చుకోవడం. బిడ్డ ఈ దశలో తన అవసరాల కోసం ఇతరుల మీద ఆధారపడతాడు. తల్లి లేదా ఇతరులు బిడ్డ అవసరాలను నమ్మకంగా తీరుస్తుంటే, ఆ బిడ్డ తరవాతి జీవితంలో ఇతరులను నమ్ముతాడు. కారణం ఏదైన, తల్లీ లేదా ఇతరులు బిడ్డ అవసరాలను సరిగా తీర్చకపోతే, తరువాతి జీవితంలో అతడు అపనమ్మకాన్ని పెంచుకొంటాడు.

ఎరిక్‌సన్ చెప్పే రెండో దశ ఫ్రాయిడ్ పాయు దశకు సమానం. మల మూత్ర విసర్జనాదుల నియంత్రణలో బిడ్డ తన కండరాలను అదుపు చేసుకొని తన వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తాడు. ఇక్కడ అతడు ఎదుర్కొనే సంకట స్థితి స్వేచ్ఛ స్వయం నిర్దేశకతలకు సంబంధించింది. నియంత్రణను సాధిస్తే, అతడు స్వయం నిర్దేశకుడవుతాడు. సాధించ లేకపోతే, తన శక్తి సామర్థ్యాల మీద అవమానం, శంక పెంచుకొంటాడు.

మూడో దశ ఫ్రాయిడ్ ఇడిపస్ దశను పోలి ఉంటుంది. ఆడపిల్ల తండ్రిని, మగ పిల్లవాడు తల్లిని పొందాలని సహజాత ప్రేరణలు పెల్లుబికినప్పుడు, ఆ బిడ్డ తన లైంగికావసరాల, సమాజ నియమాల మధ్య ఘర్షణను ఎదుర్కొంటాడు. ఈ ఘర్షణలో బిడ్డ తన లైంగిక అవసరాలను సమాజం ఆమోదించిన మార్గాలలోకి మళ్ళించగలిగితే, అతనికి చొరవ ఏర్పడుతుంది. అలా కానట్లయితే, అతడు జీవితాంతం అపరాధ భావనతో కుంగిపోతాడు.

నాలుగో దశను ఫ్రాయిడ్ ఎరిక్ సన్‌లు ఇద్దరూ గుప్తదశ అనే పిలిచారు. ఇది స్కూలు దశ. ఈ దశలో ఎదుర్కొనే సంకటస్థితి జయాపజయాలు. చదువులో బాగా రాణిస్తే, తను దేన్నైన జయించ గలననే నమ్మకం ఏర్పడుతుంది. తద్వ్యతిరేకంగా జరిగితే, న్యూనతా భావనకు గురవుతాడు.

ఉదాహరణకు న్యూటన్ స్కూలులో మొదట్లో అంతంత మాత్రంగా ఉండేవాడు. ఒకసారి ఒక శూరమ్మన్యుడు న్యూటన్ మీద కలబడ్డప్పుడు, అతడు సంకట స్థితిని ఎదుర్కొన్నాడు. న్యూటన్ తిరగబడి అతనిని మట్టి గరిపించాడు. నాటి నుంచి అతడు స్కూలు యుద్ధాలలోను, చదువులోను బాగా రాణించాడు.

ఐదోది యౌవన దశ. లైంగికాభిరుచి తిరిగి ప్రవేశిస్తుంది. వ్యక్తి ఇక్కడ విజాతి లైంగితకు మరలుతాడు, ఇక్కడ ఎదుర్కొనే సంకటస్థితి తానెవరో తాను గుర్తించడం. తాదాత్మ్యత 'ఇక్కడ ఇప్పుడు' యౌవనుడు, తాను భవిష్యత్తులో ఏమి కాబోతున్నాడు, తనకు భవిష్యత్తు ఏమిదాచి పెట్టింది

అనేవాటి మీద నిర్ణయం తీసుకోవాలి. సమాజానికి సమాజానికి పాత్రలు మారినా, తాను ఏ పాత్ర నిర్వహించాలి, ఒక సమర్థుడైన వయోజనుడుగా ఎలా పనిచేయాలి, అనే సమస్యలను అతడు ఎదుర్కొంటాడు.

ఫ్రాయిడ్ ఈ ఐదు దశలతోనే ఆగిపోతే, ఎరిక్ సన్ మరో మూడు పరిపక్వతా దశలను ప్రతిపాదించాడు.

ఈ మూడింటిలో మొదటి దశనువ వయోజన దశ. ఇతడు ఎదుర్కొనే సంకటస్థితి సన్నిహితత్వం, ఒంటరితనాలలో ఏది వ్యక్తి ఇప్పటికే తనను తాను 'కనుక్కొని' ఉంటే, అంటే తనను తాను 'ఎరిగితే', ఇహ ఆ తరవాత అతడు తన జీవితంలో భాగస్వామ్యం పంచుకొనే మరొకరిని 'కనుగొనే' సంతోషకరమైన కార్యక్రమాన్ని చేపడతాడు. మరి అలా తనను తాను కనుక్కో లేక పోతే, అంటే తాదాత్మ్యతా సంకటస్థితిని identy crisisని దాట లేక పోతే, అతడు జీవితంలో ఎవరితోను సాన్నిహిత్యాన్ని నెరపుకో లేక ఒంటరితనాన్ని అనుభవిస్తాడు. యువకుడు గాని, యువతిగాని ఈ ఆరు దశలను అత్యంత విజయవంతంగా నెగ్గుకు రాగలిగినప్పుడు, వారు విశ్వాసులుగా, స్వేచ్ఛాయుతులుగా, చొరవ గల వారుగా, అనేక రంగాలలో పోటీ పడగల వారిగా, తమతమ సామాజిక పాత్రలు పలాన అని స్పష్టంగా గుర్తెరిగి, ఇతరులను గుర్తించి, వారి ఉద్దేశాలను అర్థం చేసుకొని, ప్రవర్తించే వారిగా తయారవుతారు. అయితే మనమందరం అంత అదృష్టవంతులం కాము. మనలో ఎక్కువ మందిమి జయాపజయాల సమ్మిశ్రంతో కూడిన వారం.

ఏడో దశ, మధ్య సంవత్సరాలు, బాగా త్వర త్వరగా ఎదిగిన తరవాత, ఎదుగుదల ఆగిపోయి, ఒక నిశ్చల స్థితి వస్తుంది. ఇక్కడ వీరు 'అతి సంతృప్తులు' అవుతారు. వీరికి సన్నిహితత్వం కంటె ఇంకా ఎక్కువ ఏదో కావాలి. వారు ఉత్పాదకులు కావాలి. తోటి వారికి సహాయకారులుగా ఉండాలి. ఇక్కడ వ్యక్తి ఎదుర్కొనే సంకట స్థితి ఉత్పాదకత నిశ్చలతల మధ్య ఉంది.

ఎనిమిదో దశ పరిణత Maturity. ఈ దశను ఎవరో కొద్దిమంది అదృష్టవంతులు. పూర్తిగా మొదటి ఏడు దశల ఘర్షణలను విజయవంతంగా దాటుకు వచ్చిన వారు చేరతారు. ఒకడు తన అంతిమ సంవత్సరాలలో తన జీవిత అంతాన్ని, మరణాన్ని నిండుగా ఎదుర్కోవలసి ఉంటుంది. మరణాన్ని మనం ఆలోచించలేము, అయినా అది అక్కడ ఎప్పుడూ ఉండనే ఉంటుంది. ముందరి ఘర్షణలను హాయిగా, విజయవంతంగా, పరిష్కరించి బయట పడినవాడు. మరణాన్ని గూడ తన జీవితంతో సమీకరించుకో గలుగుతాడు, ఐక్యం చేసుకోగలుగుతాడు. జీవితం సాఫల్యంగా గడించిందని తెలుసుకొన్నవాడు, తాను జీవితాన్ని సమగ్రంగా జీవించాననే స్పృహతో మరణించవచ్చు. ముందరి దశల్లో ఓడిన వాడు, జీవితం నిరర్థకంగా, అసంపూర్ణంగా, అసమగ్రంగా, వ్యర్థంగా గడిచిందని వాపోయి కృంగిపోతాడు.

# ప్రాకృతిక వాదం - ఆదర్శవాదం
## (1908వ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కార స్వీకారోపన్యాసం)

మూలం : రూడోల్ఫ్ యూకెన్ అనువాదం: బి.వి.రామిరెడ్డి

అతి ప్రాచీనమైన కొత్త ప్రశ్నలు మానవజాతి చరిత్రకు తెలుసు. అవి ప్రాచీనమైనవి - ఎందుకంటే ప్రతి జీవన విధానంలోను వాటికి సమాధానాలున్నాయి. ఎప్పుడూ అవి కొత్తవే - ఎందుకంటే అలాంటి జీవన విధానాలు తమ పరిస్థితుల మీద ఆధారపడి, తరచుగా మారుతుంటాయి. ఫలితంగా తరాలుగా అంగీకరింపబడ్డ సత్యాలు సంఘర్షణల్ని సృష్టించి సమస్యలకు కారణాలుకావొచ్చు.

అలాగే ప్రాకృతిక వాదానికి, ఆదర్శవాదానికి మధ్యగల తేడాను గురించి ఈ రోజు మనం మాట్లాడుకుంటున్నాం. ఈ మాటల అర్థాలు ప్రయోగంవల్ల మొద్దుబారిపోయాయి. అవి చాలా అపార్థాలకు కారణమౌతాయి. బద్ధకం వల్ల మనం అలాంటి మాటల్ని ఉపయోగిస్తుంటాం. మనిషి ప్రకృతి వల్ల నిర్ణయించబడతాడా లేక దాన్నుండి విముక్తుడై ఉన్నతుడౌతాడా అనేది ప్రశ్న. మనమంతా మనిషికీ ప్రకృతికీ మధ్య సన్నిహిత సంబంధాలున్నాయని అంగీకరించాం. అయితే అదే సంపూర్ణ జీవితమా? అని మనమంతా ప్రశ్నిస్తున్నాం. మనిషి కార్యాల్ని, బాధల్ని ఈ బంధాలే నిర్ణయించాయా? లేక దానికన్న ఉన్నత దశ జీవితానికి వున్నదా అనేదీ ఆ వాదంలోని భాగమే. మొదటిది ప్రకృతి వాదానికీ, రెండోది ఆదర్శవాదానికీ ప్రతీకలు. ఈ రెండు సిద్ధాంతాలు ప్రాథమికంగాను, వాటివ్యాల్లోను విభేదిస్తాయి. మనిషి అదనపు జీవితం అతని ఊహాత్మకతలో వుంది. జీవితం దాని నిజమైన మూలాలతో బంధాల్ని పునరుద్ధరించుకుంటుంది. మనిషిలోని ప్రకృతికి అతీతమైన విషయాన్ని దాని ఆసరాతో ప్రకృతికి విరుద్ధంగా చూడాలి. ఈ విరుద్ధ స్థితి ఆత్మ నుండే ఉద్భవిస్తుంది. ఆత్మ యొక్క సహజ జీవనం భౌతిక జీవన విధానానికి ఒక చేర్పు మాత్రమే. భౌతిక జీవితాన్ని జాగ్రత్తగా ఉంచడమే దాని ప్రధానమైన ఉపయోగం. మనిషి యొక్క ఉన్నత వికాసం, తెలివి తేటలు, జ్ఞానం, అన్నీ జంతు బలానికి శక్తిని, వేగాన్నిస్తాయి. ఇంద్రియాలకు పదును పెడతాయి. అయితే దీని విపరీత రూపానికి ఉపయోగం లేదు. పని ఎప్పుడూ భౌతికావసరాలకు, జీవితపు ఉనికికి ఉపయోగపడుతుంది. ప్రకృతివాదం మానవ జీవితాన్ని ఆదశకే పరిమితం చేస్తుంది. అలాకాక ఆదర్శవాదం అంతరంగాన్ని విముక్తం చేస్తుంది. మానవ జీవితం విలువలతో, ఆదర్శాలతో, సత్యం, మంచి, సౌందర్యం లాంటి వాటితో నడుపబడుతుంది. మానవ తపనలను అవసరాలను లోబరిస్తే అది భరించరాని న్యూనత అవుతుంది; మనిషి ఔన్నత్యాన్ని, గాంభీర్యాని, దగాచేసినట్లవుతుంది. ఈ వ్యతిరేకతలు రాజీ పడవు. ఆ రెంటిలో ఒకదాన్నే ఎంచుకోవలసి వస్తుంది.

ఈ కాలంలో జీవితంలోని గాఢమైన మార్పులు కొత్త సమస్యల్ని వెలుగులోకి తెచ్చాయి. శతాబ్దాల సంప్రదాయం మనల్ని అగోచర ప్రపంచం కోసం అన్వేషింప జేస్తుంది; బాహ్య, బాహ్యాతీత ప్రపంచాల్ని బేరీజు వేస్తుంది. మధ్య యుగాల మానవుడికి ఈ ప్రపంచం ఒక బాటసారి తాత్కాలిక నివాసం. దాన్ని మనం శోధించ లేం; అది మనల్ని ఏమీ సాధించనీయదు, మనల్ని ఏ వేళ్ళతోను కట్టి వేయలేదు. అలాంటి నమ్మకాల మధ్య ప్రకృతి అనేది అధోలోకమే. పెట్రార్క్ వెన్‌టాక్స్ శిఖరాన్నధిరోహించినపుడు

---

బి.వి. రామిరెడ్డి, సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు, విజయవాడ.

ఆల్ప్స్ పర్వత శిఖరాల సౌందర్యానికి ముగ్ధుడై - అలాంటి సౌందర్యానికి వివశుడవడం ఆ సౌందర్య స్రష్టి కర్తకు అన్యాయం చేయడమౌతుందేమో, ఆ సౌందర్యం అతణ్ణి ప్రార్థించనీయ దేమో - అనుకున్నాడు.

ఇవన్నీ మారిపోయాయి. అనుభవంతో, వస్తువులతో ప్రపంచాన్ని మన యిల్లుగా మార్చుకున్నాం. శాస్త్రవిజ్ఞానం అందుకు నాయకత్వం వహించింది, ప్రకృతితో మనకు దగ్గరి సంబంధాన్నేర్పరిచింది. అందువల్ల మన జీవితం దాని ప్రభావానికి లోనయింది. ప్రకృతిలోని కొన్ని సూత్రాలు గణిత సూత్రాల కంటె వెనుకబడి వున్నాయని కెప్లర్ గుర్తించాడు. ఒక శతాబ్దం క్రితం దాకా అదే స్థితి కొనసాగింది. గొప్ప కవుల,' ఆలోచనాశీలుర యుగంలో ప్రకృతి కల్పించే సమస్యల నుండి తప్పించుకునేందుకు ఎంతో సమయం వృధాఅయింది. ప్రయాణ వార్తా సౌకర్యాలు అధ్వాన్నంగా వుండేవి. అన్ని రంగాల్లోను మన యుగం చరిత్రలో కనీవినీ యెరుగని మార్పుల్ని చూసింది. 17వ శతాబ్దంలో ప్రారంభమయిన శాస్త్ర విజ్ఞానం 19వ శతాబ్దానికి తిరుగులేని దశకు చేరుకుంది. ప్రకృతి రహస్యాలను తెలుసుకుని, జీవపరిణామ సిద్ధాంతాన్నుపయోగించుకుని ప్రకృతిలోని అన్నింటిని అనుభవంలోకి తెచ్చుకోవడం జరిగింది. పరిణామవాదం ప్రకృతిమీద మనిషి ఆధారపడడాన్ని బహిర్గతం చేసింది; ఆ ఆధారంతో తనని తాను బాగా అర్థం చేసుకోవడానికి దోహదపడింది.

శాస్త్ర విజ్ఞానం ప్రసాదించిన ఫలితాలతో పరిసరాలకూ మనిషికీ వున్న సంబంధాలలో ఎన్నో మార్పులు తెచ్చాయి. పూర్వం ప్రపంచం స్థిరమయినదని నమ్మేవారు. మనిషి అన్ని సమస్యలను, కష్టాలను దేవుడి నిర్ణయంగా భావించి భరించేవాడు. జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని భావించినా అది నిష్ఫలం అని భావించేవాడు. మన యుగంలో, మనిషి సహకార కృషితో జీవితాన్ని ఉన్నతీకరించుకోవచ్చునని హేతువు వల్ల గ్రహించాడు. గత యుగాలు అసాధ్యాలనుకున్న వాటిని మనం సుసాధ్యాలుగా చేసుకున్నాం. మనం ఎన్నో ఆశ్చర్యకర విజయాలను సాధించుకున్నాం. టెక్నాలజీని మొత్తం సమాజానికి ఉపయోగపడేట్లు మార్చుకున్నాం. ఇప్పుడు మనిషి ఉన్నతాదర్శాలను అందుకోవడానికి భావాతీత ప్రపంచంలోకి పారిపోనక్కర్లేదు.

ఇవి నగ్నసత్యాలు. భౌతిక ప్రపంచంతో మన అనుబంధం చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నది. ఏ తాత్త్విక చింతన అయినా ఈ నిజాలను గుర్తించవలసిందే. ప్రకృతి వాదం దీనికి అతీతంగా వెడుతుంది. అది మనిషిని ప్రకృతిలో ఒక భాగంగానే నిర్వచిస్తుంది. దీనిని జాగ్రత్తగా పరిశీలించవలసి వుంది. పాత నమ్మకాలను విప్లవకరమైన మార్పులు ప్రభావితం చేసినపుడు మనం ఇచ్చే తీర్పులు తికమక పడతాయని చరిత్ర బోధించింది. మోసం, పొరపాట్ల ముందు నిస్సహాయుడైన మనిషి అభిప్రాయాలు, నిజాల విషయంలో తికమక పడతాడు.

మనిషి నిస్సహాయతకు వ్యతిరేకంగా చేసేవాదాలు, ఆధునిక ఉద్యమపు విశదీకరణలోనే వున్నాయి. మనిషి కేవలం ప్రకృతిలో భాగం మాత్రమే అయితే మనిషి మనుగడ ఒక సూత్రంగానే మిగిలిపోతుంది. అప్పుడు జీవితం బాహ్య ప్రపంచం మీద ఆధారపడుతుంది. అపుడు ఇంద్రియాల లోపాలను పరిహరించుకునే అవకాశమే వుండదు; అంతర్ జీవన లయకు అర్థం లేదు. అన్ని విలువలు, ఆదర్శాలు అంతమౌతాయి. కాని, మానవ కృషి అందుకు విరుద్ధమైన చిత్రాన్ని చూపిస్తోంది.

ఆధునిక శాస్త్ర విజ్ఞానం ఇంద్రియ స్పర్శలోంచి వొచ్చిందికాదు. అది మొత్తం ప్రాచీన జ్ఞానాన్ని పటాపంచలు చేస్తేవొచ్చింది. అది అవసరం. ఎందుకంటే పాత సూత్రాలు ప్రాచీనమైనవి; అనాగరికమైనవి. ప్రకృతిని శాస్త్రీయంగా మనిషి నుండి వేరుచేసి అవగాహన చేసుకోవడం వల్ల మన అవగాహన సమగ్రమౌతుంది. సత్యాన్వేషణవల్ల వస్తువులతో ఏకీ భావం వల్ల, మనిషి అంతర్జీవితం విస్తృతమౌతుంది. హేతు దృక్పథం వీటనన్నిటిని కలిపి అవగాహన చేసుకునేందుకు ఉపయోగ పడుతుంది. మనిషి మేధస్సు సాధించిన అవగాహన ప్రకృతి మీద అతని ఆధిపత్యాన్ని, ఔన్నత్యాన్ని, స్థాయిని రుజువు చేస్తోంది. మేధా సంపత్తి సాధించిన ఆధునిక శాస్త్ర విజ్ఞానం యొక్క అంతర్ నిర్మాణం మనిషిని ప్రకృతి నుండి దూరం చేస్తున్నది. ఆధునిక టెక్నాలజీ మనిషిని ప్రకృతి ముందు ఉన్నత స్థితిలో నిలబెడుతోంది.

సాంఘిక ప్రగతి మానవ జీవితానికి ఎల్లల్ని నిర్దేశించడం లేదు. భౌతిక వస్తువులు మానవ జీవితాన్ని విస్తృత పరచడానికి తోడ్పడతాయి. మనం కేవలం ఇంద్రియ సౌఖ్యాలను పెంచుకోవడానికి మాత్రమే గాక ప్రపంచం మీద సంపూర్ణాధిపత్యాన్ని సాధించుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. సంఘం అనగానే సమిష్టి విధులు, హక్కులు, లాభాలు గుర్తొస్తాయి. సాంఘిక ప్రగతి ప్రాకృతికవాదాన్ని వ్యతిరేకిస్తుంది.

ప్రకృతివాదం ఆధునిక జీవన విధానాన్ని విశదీకరించుకోవడానికి సరిపోదని తెలుసుకున్నాం. జీవన విధానం తన మూలాల నుండి ఎదిగిపోయి, ఉన్నతమైన ఆధ్యాత్మిక స్వేచ్ఛను ఆవిష్కరించింది. మనసుకు పరిసరాలు కేవలం వాటి మీద కృషి చేయడానికి మాత్రమే అవసరమౌతాయి. మేధా కార్యాన్ని మనం జీవితంలో ఒక భాగంగా తీసుకున్నాము. కళాకారుడి సృజన దీనికి ఉదాహరణ. బాహ్య వస్తువు ఆత్మలో భాగమై ఒక కొత్త సజీవరూపం తయారౌతుంది. కవి ఒక ఇంద్రజాలికుడు. అతడు వస్తువులకు భాషనిచ్చి, వాటిద్వారా తనను వ్యక్తీకరించుకుంటాడు. అవి కవి ఆత్మలో సహజమౌతాయి. దైనందిన జీవితంలోను అదే జరుగుతుంది. మానవ సంబంధాలలో ఎదుటి వ్యక్తిని మనలోకి తీసుకుని మనతో ఐక్యం చేసుకుంటాము. అందువల్లనే ప్రజల్ని, దేశాలని, మానవాళిని ప్రేమించగలుగుతున్నాం. సత్యాన్వేషణ మన అంతర్ ప్రపంచ పరిధిని విస్తృతం చేస్తుంది.

ఆవిధంగా అందం, మంచి, సత్యం వస్తువుతో కలిసి అంతర్ ప్రపంచంలో భాగమౌతాయి. ఆ విధంగా జీవితం తన గాఢమైన, అర్థవంతమైన బాంధవ్యాన్నేర్పరుచుకుంటుంది. జీవితంతో కలిసి పోయిన వస్తువు ఉన్నత రూపాన్ని పొందుతుంది. జీవితం తనను తాను సృజించుకుని విస్తృతమౌతుంది. ఆవిధంగా జీవితం బాహ్యాంతరాల నెదుర్కొని తన మనౌన్నత్యాన్ని సృష్టించుకుంటుంది. అన్నీ కలిసి అంతర్ ప్రపంచాన్ని రూపొందిస్తాయి. ఇదే మేధా కార్యకలాపాలకు మూలం అవుతుంది. మనం అందరిలో జీవిస్తూ మనం సాధించిన దాన్ని అందరిదిగా భావిస్తాం. జీవిత తపనలో మనిషి విశాలమౌతాడు.

ఈ జీవన మార్పును గమనిస్తే కొత్త జీవన స్థాయి మనిషికి కొత్త కార్యక్రమాలను సృజిస్తుందని తెలుస్తుంది. విశ్వం నుండి వొచ్చే అసంకల్పిత చలనం మనకు శక్తినిచ్చి, కొత్త నిజాలను ఎదుర్కొనేందుకు దోహదం చేస్తుంది; ప్రాకృతిక వాస్తవాన్ని ప్రవేశపెడుతుంది. ఆరకంగా విశ్వచలనానికి తోడ్పడుతుంది.

ప్రకృతి స్థాయికి ప్రాథమికంగా చెందిన మనిషి ఈ కొత్త స్థాయికి ఎదుగుతాడు; ప్రపంచపు సమగ్రతకు తోడ్పడతాడు. అప్పుడీ ప్రపంచం అతనికి పరాయిది అనిపించదు.

ఈ సంపూర్ణమైన ప్రతిగతికీ, ఆత్మజ్ఞానానికి ఆదర్శవాదం తోడ్పడుతుంది. మనిషి మేధో జీవితం ప్రకృతితో ఘర్షణలోనే పెరుగుతుంది. ఈ రెంటికి మధ్య జరిగే సంఘర్షణ ఈ కొత్త ప్రపంచపు సమస్యలకు సంబంధించినదే. చరిత్రలో ఎన్నోసార్లు మానవ జాతి జీవితాన్ని సమగ్రీకరించుకునేందుకు ప్రయత్నించింది. ఆ విధంగా ఎన్నో యుగాలు మనిషి ఆధ్యాత్మిక జీవితం కోసం కృషి చేశాడు.

గ్రీకుల కాలం నుండీ పాశ్చాత్య సంస్కృతి ఈ విధానాన్ని అనుభవంలోకి తెచ్చుకుంది. గ్రీకు జీవన విధానంలో ఈ సమగ్రీకరణ ప్రయత్నం కనిపిస్తుంది. కళలు యిందుకు దోహదపడ్డాయి. మధ్యలో క్షీణయుగం వచ్చినా అది మనిషిని మరో కొత్త సమగ్రతకు సిద్ధం చేసింది. క్రైస్తవంలో ఈ సమగ్రీకరణ అంతా నీతికి లోబడేట్టు చేసింది. ఆవిధంగా నీతి సమగ్రీకరణ జీవితాన్ని ప్రభావితం చేసింది. అది మనసుకు స్వభావం మీద పెత్తనాన్నేర్పాటు చేసింది.

కొత్త మానవత ప్రపంచ సంస్కృతిని ప్రేమతో ఆహ్వానించింది. మతానికి నీతికి ఒక కలయిక నేర్పరిచింది. అనంత సత్యం వేపు పయనించడానికి మేధోశక్తులు తోడ్పడ్డాయి. ఇప్పటికీ మేధో జీవితం మనల్ని ముంచెత్తుతూనే వుంది. ఈ స్థితిలో మనకెన్నో సందేహాలొస్తుంటాయి. త్వరలోనే మనం ఈ ఆధునిక సమగ్రతలోని లోపాలను గమనిస్తాం. పాత విధానాలు మాయమౌతాయి. కొత్త విమర్శనాత్మక రంగంలోకి మనం అడుగిడతాం.

శాస్త్ర విజ్ఞానఫలితాలు జీవన తౌల్యాన్ని తమ అధీనంలోకి తీసుకుంటాయి. ఆదర్శవాదం జీవితపు సందేహాలను, ఘర్షణలను, లోపాలను పరిహరించి జీవితపు నూతన సమగ్రతకు దారి చూపుతుంది. ఆధునిక యుగం ఎన్నో మార్పుల్ని తెచ్చింది. మనం జీవితాన్ని సంపూర్ణంగా మేధావంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. ముందుగా మనం జీవితాన్ని అభేద్యం చేసుకోవాలి. అప్పుడే మనకు ఈ కొత్త మార్పులను, వాటి ప్రభావాలను అవగాహన చేసుకుని, తదనుగుణంగా పరిసరాలను మలుచుకునేందుకు వీలవుతుంది.

ఆదర్శవాద పునరుజ్జీవనం ఎన్నో సమస్యలను ఎదుర్కోవలసి వుంటుంది. మనిషి ఒకసారి సహజ జీవన విధానం నుండి బయటపడ్డాక మళ్ళీ ఆ జీవన విధానాన్ని అంగీకరించలేదు. ఆత్మిక సంబంధం అతణ్ణి కలిచివేశాక బాహ్య సంబంధాలు అతణ్ణి సంతృప్తి పరచలేవు. ఆవిధంగా ప్రకృతి వాదం నుండి అన్ని రకాలుగా మనిషి బైటపడతాడు.

మనకాలపు విచిత్రానుభవాలు, అవసరాలు మనల్ని ఆదర్శవాదం వేపు నడుపుతాయి. పెరిగిన పని వొత్తిడి, జీవన సంఘర్షణ జీవితపు అర్థాన్ని, ఆదర్శాన్ని మరుగుపరిచాయి. ఆ ఆదర్శాన్నందుకోవడానికి బలమైన అభినివేశంతో మానవాత్మను ఉన్నతీకరించుకోవాలి. మనస్సుయొక్క సృజనాత్మకత అన్ని కాలాల్లోను చిన్న అవసరాలతో చుట్టుముట్టబడింది. వాటిని తొలిగించుకునేందుకు మనం ప్రయత్నించాలి. దైనందిన జీవితపు గందరగోళాలలో ఏది ఉన్నతమయిందో, ఏది పతన కారణమయిందో తెలుసుకోవడం కష్టం. విచక్షణా జ్ఞానంతో వాటిని వివేచించుకోగలగాలి.

సహజ వాదానికి, ఆదర్శవాదానికి మధ్య చెప్పబడిన ఘర్షణ జీవితపు అన్ని స్థాయిల్లోను వుంటుంది. సహజవాదం సాహిత్యానికి అంతర్ స్వేచ్ఛను ప్రసాదించలేదు. జీవిత గడియారంలో సాహిత్యం వొక ముల్లు. సాహిత్యం విశదీకరిస్తుంది; స్థిరపరుస్తుంది, కాలంలో వినాశకరమైన వాటిని వివరిస్తుంది; మననమేధోస్థితిని, దాని సమస్యలను ఎదుర్కొనేట్టు చేస్తుంది. అది జీవితాన్ని గందరగోళాల నుండి ఉన్నతీకరిస్తుంది; ఉన్నత సత్యాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది; జీవితంలో హేతువును బలోపేతం చేస్తుంది. అది నోబెల్ సాహిత్యానికి యిచ్చిన గౌరవంలాగ పనిచేస్తుంది.

ఆవిధంగా మన ఆదర్శవాద నమ్మకాలను కొనసాగించడానికి బలమైన కారణాలున్నాయి. అది వ్యక్తి గతమైన అవసరంగా గుర్తించి, మేధస్సును కాపాడుకోవడానికి ప్రయత్నించాలి. ఉత్సాహం, ధైర్యం, స్థిరనమ్మకం ఆవిజయానికి అవసరం.

## సమర్పణ

**హెరాల్డ్ జార్నె**, డైరెక్టర్, స్వీడిష్ అకాడెమి.

ఆల్ఫ్రెడ్ నోబెల్ కార్యవాది. అంతర్జాతీయ వ్యాపారవేత్తగా ఆధునిక పరిణామాల్లోని అంతస్సంఘర్షణల ప్రమాదాన్ని అతడు గుర్తించాడు. మానవాళి అవసరాన్ని గుర్తించి, తన సంపాదన మీది వడ్డీ సొమ్మును మానవజాతి మేలుకోసం వినియోగించడం మంచిదని భావించాడు.

మానవుడు తయారు చేసిన పనిముట్లు, ఆయుధాలు సృష్టిస్తున్న సవాళ్ళను, గందరగోళాలను గ్రహించి, మానవ సమాజ ప్రగతికి తనవంతు బాధ్యతను వీలునామాగా సమర్పించాడు. తాను సృజించిన యుద్ధపరికరాలు, వాటి ఉపయోగాలను గ్రహించాడు. అందుచేతనే అంతర్జాతీయ శాంతికి దోహదపడే ప్రయత్నాలను సమర్థించాలని, నిర్ణయించుకున్నాడు. మన సంస్కృతి సంఘర్షణలతో నిండివున్నదని ఆయన గ్రహించాడు. తాను కనిపెట్టిన వస్తువులను మనిషి తన వినాశనానికే ఉపయోగిస్తాడని తెలుసుకున్నాడు. ఆయనకు మేధాసంపత్తి అంటే చాలా యిష్టం. శాస్త్రీయ పరిశోధనల ఫలితాలు మానవ కళ్యాణానికి ఉపయోగపడాలని ఆయన ఆకాంక్ష. అందుకే ఆయన సాహిత్యంలో ఆదర్శవాదానికి ఒక పురస్కారాన్నేర్పాటు చేశాడు.

ఆల్ఫ్రెడ్ నోబెల్ విక్టర్ రిడ్‌బెర్గ్ కవిత్వమూ, తాత్త్విక చింతనలవల్ల ప్రభావితుడయ్యాడు. మానవ మేధస్సు నుండి జనించే ఆదర్శాలు సంస్కృతిని సృజించి ప్రోత్సహిస్తాయి. జీవితపు చీకటిలో నుండి ఒక కొత్త ఉషస్సుకు వెలుగు బాట లేర్పడతాయి. ఎక్కడ అలాంటి ఆదర్శాలు రూపు దిద్దుకుంటాయో అవి మానవుడు తన తోటి మానవుడికి సహాయ పడేందుకు బలాన్నిస్తాయి. అది కవి యొక్క భావోద్రేకం కావొచ్చు, తాత్త్వికుడి జీవిత సమస్యల పరిష్కార ప్రయత్నం కావొచ్చు, లేదా పండితులు, రచయితల ఆదర్శదర్శనా ప్రయత్నం కావొచ్చు. అలాంటి సాహిత్యాన్నే మనసులో వుంచుకుని నోబెల్ ఈ పురస్కారాన్నేర్పాటు చేశాడు. సాహిత్యం శాస్త్రం, కళలను వుపయోగించుకుని మానవ జాతికి ఉన్నతంగా ఉపయోగపడే సిద్ధాంతాలను స్థిరపరుస్తుంది.

ఈ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారాన్ని నోబెల్ ఆశయాల కనుగుణంగా ఈ యుగపు అత్యుత్తమ ఆలోచనా పరుడైన మేధావి అయిన ప్రొ॥ రుడోల్ఫ్ యూకెన్‌కు - ఆయన సత్యాన్వేషణకు

ఆలోచనా నైశిత్యపు శక్తికి, కాలాతీత దృక్పథానికి; ఇవన్నీ కలిసి వున్న ఆయన జీవన తాత్త్వికతకు ఇవ్వాలని నిర్ణయించబడింది.

గత ముప్పై సంవత్సరాలుగా ప్రొ॥ యూకెన్ తాత్త్విక చింతనలో ఎన్నో కోణాలను స్పృశిస్తూ సృజించిన గ్రంథాలెన్నింటినో వెలువరించాడు. ఆయన గ్రంథాలు తాత్త్విక మూలాలనెన్నింటినో వివరించాయి. ఆయన ఈ మధ్యనే ప్రచురించిన పుస్తకాలు ఆయన ఆలోచనల్ని మనకు అర్థం చేస్తాయి; సమకాలీన సాంస్కృతిక సమస్యలకు అవి పరిష్కారాలను సూచించాయి.

కాలాభావం వల్ల ఇక్కడ యూకెన్ తాత్త్విక చింతనను విపులంగా చర్చించేందుకు ఇది సమయం కాదు. నేను కొన్ని సామాన్య విషయాలను మాత్రమే స్పృశించేందుకు ప్రయత్నిస్తాను. ప్రొ॥ యూకెన్ తన తాత్త్విక చింతనను చరిత్ర ప్రభావితం చేసిందనీ; చరిత్ర, భాషా శాస్త్రాల అధ్యయనం తనను తాత్త్విక చింతనవేపు నడిపించాయనీ అంటాడు. తన యౌవన కాలంనించీ సంఘమూ, మానవ జీవితమూ తాత్త్వికాలోచనల కన్నా ముఖ్యమైనవిగా భావించానని అయన అంటాడు.

ప్రస్తుతం జర్మనీలోను, ఇంకా అనేక చోట్ల తలెత్తుతున్న ఆదర్శవాదం అర్థ శతాబ్దం క్రితం వున్న హెగెల్ ఉత్కృష్ట సిద్ధాంతంతో శూన్యమైపోయింది. జీవితపు అఖండ సంపదను పొందేందుకుగాను అది మానవ చింతన, సంస్కృతులను ఒక సంపూర్ణమైన ఆలోచనా విధానానికి దారితీసింది. అది భౌతిక వాదాన్ని మార్చే శక్తుల్ని బలోపేతమూ వేగవంతమూ చేసింది.

మన స్వీడన్ దేశీయులకు బోస్ట్రొం, ప్రొ॥ యూకెన్‌లకు మధ్యగల సాభిప్రాయత, పోలికలు బాగా తెలుసు, వారిద్దరు సాంస్కృతిక పునాదుల కాలం నుండీ వొస్తున్న ప్రాథమిక సూత్రాలను - భౌతిక, వస్తు వాద ఆలోచనలవల్ల, ఏర్పడుతున్న భయాన్ని వ్యక్తపరిచారు. వారిలో వాస్తవవాద ఆదర్శం కనిపిస్తుంది. సోక్రటీసు, ప్లేటోలను ఈ వాదమే నడిపించింది. అందుకే వారిలో మూఢ సూత్రాల మూస కాక సత్యాన్వేషణే కనిపిస్తుంది. ఈ అనంత సత్యాన్వేషణ మార్గమే యుగాలుగా నడుస్తోంది. ఆ విధంగా యూకెన్, బోస్ట్రొం తమ వేరు వేరు మార్గాల ద్వారా ఒకే గమ్యాన్ని చేరుకున్నారు.

తన యౌవన కాలం నుండి యూకెన్ ఈ తాత్త్విక మార్గాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ వొచ్చాడు. ఎన్నో తాత్త్విక విధానాలు కూలి పోవడం అనుభవం ద్వారా గ్రహించాడు. తత్త్వశాస్త్రం అనేక మార్గాల అనేకమైన ఆశలతో నడిచింది. ఒక్కోసారి 'మళ్ళీకాంట్ దగ్గరకే' అనే నినాదం వినిపించేది. మళ్ళీ తాత్త్వికతను సురక్షితమైన స్థానాన్నిచ్చే ప్రయత్నాలు ఆధునిక శాస్త్ర విజ్ఞానం సాధించిన విజయాలను స్వతంత్రంగా ప్రశ్నిస్తూ దాని స్థానాన్ని స్థిరపరచాలనే ప్రయత్నాలు జరిగాయి. యూకెన్‌కు వీటన్నిటి మీద అవగాహన వుంది. అయితే ఆయన ప్రధాన కార్యక్షేత్రం చారిత్రక, విమర్శనాత్మక పరిశోధన. తన ముందున్న చాలమంది మేధావులలాగే యూకెన్ సాంస్కృతిక వారసత్వపు పునాదులు లేకుండా నిజమైన ప్రగతి సాధ్యంకాదని నమ్మాడు. తాత్త్విక శాస్త్ర పరంపర ఇతర శాస్త్రీయ విజ్ఞానంలాగే అన్ని సమస్యలను ఎదుర్కొంటూ ముందుకు నడుస్తుందని అంటాడు.

ఎన్నో మోనో గ్రాఫులు, వ్యాసాలతో బాటు 1878లో యూకెన్ ఈ సిద్ధాంతాన్ని ప్రచురించాడు. తన ''బేసిక్ కాన్సెప్ట్స్ ఆఫ్ మోడర్న్ థాట్'' అన్న గ్రంథంలో తాత్త్విక చింతన ప్రారంభాల నుండి

వాటి పుట్టుక, రూపాంతరాలు, ఆధునిక రూపాల పరిణామాలను చర్చించాడు. అతనికి ఇలాంటి విషయాలను సూత్రీకరించడంలో ఇష్టంలేదు. అతనికి చోదకతతో కూడిన కాలాల్ని విశదీకరించడమే యిష్టం. సూత్రాలు ఆయా కాలాలకు అర్థంపడతాయి. ఈ సంవత్సరమే వచ్చిన ఆయన నాలుగవ సంకలనం ఆధునిక యుగపు సాంస్కృతిక సంఘర్షణను విమర్శనాత్మకంగా విశదీకరిస్తుంది. 1908లో ప్రచురింపబడ్డ ఆ పుస్తకం పేరు ''మెయిన్ కరెంట్స్ ఆఫ్ మోడర్నథాట్'' ఇందులో రచయిత తన ప్రాథమిక భావాలను సిద్ధాంతాలను సిద్ధం చేసుకున్నాడు..

ఆలోచనాశీలి మానవ సంస్కృతికి సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలను, సమస్యలను తన దృక్కోణం నుండి పరిశీలించినపుడు తాను కేవలం ప్రశ్నించడం ద్వారా ఆ సమస్యలకు పరిష్కారాలను కనుగొనలేనని గ్రహిస్తాడు. ఈ సమస్యలు మొత్తం మానవ జీవితపు మనుగడకు సంబంధించినవి. అవి మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. అవి యుగాల సమాజాలను సంస్కరిస్తాయి. వాటి ప్రభావాలను గుర్తించడం అంటే మానవ మేధా చరిత్రను పరిశీలించడమే. అలాంటి పరిశీలనలు తాత్త్విక చింతనను విశాల పరుస్తాయి. యూకెన్ 1890లో ప్రచురించిన ''ది ప్రోబ్లమ్ ఆఫ్ హ్యూమన్ లైఫ్ యాజ్ వ్యూడ్ బై ది గ్రేట్ థింకర్స్ ఫ్రమ్ ప్లేటో టు ది ప్రెజంట్ టైమ్'' అలాంటి ప్రయత్నమే. ఈ పుస్తకం ఏడుసార్లు పునర్ముద్రింపబడింది. ఇది యూకెన్ పరిశీలనాదృష్టికి, శైలికి, ఆలోచనా విధానానికి సాక్షీభూతంగా నిలుస్తుంది.

యూకెన్ 1896లో ప్రచురించిన ''దిస్ట్రగుల్ ఫర్ ఎ స్పిరిచువల్ కంటెంట్ ఆఫ్ లైఫ్; న్యూ ప్రిన్సిపుల్ ఆఫ్ ఫిలాసఫి'', 1907లో ప్రచురించిన ''లైఫ్స్ బేసిస్ అండ్ లైఫ్స్ ఐడియల్; ది ఫండమెంటల్స్ ఆఫ్ న్యూ ఫిలాసఫి ఆఫ్ లైఫ్,'' 1908లో రచించిన ''ది మీనింగ్ అండ్ వాల్యూ ఆఫ్ లైఫ్'', ''ఇంట్రడక్షన్ టు ఎ ఫిలాసఫి ఆఫ్ ద మైండ్'' మొదలైన గ్రంథాలలో తనదైన తాత్త్విక మార్గాన్ని విశదీకరించాడు.

ఈ మధ్య యూకెన్ మత విషయకమైన సమస్యలను కూడ పరిశీలించాడు. 1901లో ప్రచురించిన ''ది ట్రూత్ ఆఫ్ రెలిజియన్'' 1907లో రచించిన ''మెయిన్ ప్రోబ్లమ్స్ ఆఫ్ కాంటెంపొరరీ ఫిలాసఫీ ఆఫ్ రెలిజియన్'' ఇందుకు ఉదాహరణలు. ఈ రెండవ గ్రంథం జెనా విశ్వ విద్యాలయంలో ఇచ్చిన ఉపన్యాసాల సంకలనం. ఈ సంవత్సరం ''కాంటెంపొరరీ సివిలిజేషన్'' అనే విజ్ఞాన సర్వస్వంలాంటి గ్రంథంలో తాత్త్విక చింతన గురించి తన అభిప్రాయాలను వివరించాడు. ప్రస్తుతం ఆయన నీతి సమస్యలను పరిశీలించే ప్రయత్నంలో వున్నారు. చరిత్రను ఆయన చూసిన విధానం చరిత్రతో తన ఆలోచనను అనుసంధించిన విధానం ఆయనను ఉన్నత స్థానంలో నిలబెడతాయి.

సంస్కృతికి చరిత్రవల్ల సంభవించే ప్రమాదాన్ని యూకెన్ గుర్తించాడు. మానవుడి నిర్ణయాలను నియంత్రింప జూసే, నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ఆయన నిరసించాడు. నీషేలాగా ఆయన మనిషి మంచితనం, నిర్ణాయక శక్తితో నీతి సూత్రాల శాశ్వత ఔన్నత్యంముందు నిలబడ గలడని నమ్మలేదు. ఇక్కడ వ్యక్తిగాని, మానవాతీత వ్యక్తి యొక్క ఉనికిగాని ముఖ్యం కాదు. విశ్వ మేధాశక్తుల కలయికతో ఏర్పడే స్థిర వ్యక్తిత్వం ముఖ్యం. యూకెన్ ప్రాకృతికమైన వొత్తిళ్ళ నుండి అనివార్యమైన చారిత్రక కార్యకారణాల ప్రభావం నుండి మనిషిని విడిపించేందుకు కృషి జరగాలన్నాడు.

చరిత్రలోను వ్యక్తిత్వపు ఉనికిలోను మనిషికి ఉన్నత జీవితం వుంది. అది ప్రకృతిలో గాక తనలోనే, తన మనస్సులోనే ఉంటుంది. అది కాలాతీతమైనది. అది తత్కాలీన రూపాల్లో వ్యక్త మౌతుంది. మేధా జీవితంలో పాల్గొనే మనిషికి కాలాతీతమైన శక్తి వుంటుంది. అది మనిషి ద్వారా ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుంది. అది ఊహాజనితం కాదు, సంపూర్ణ జీవశక్తి.

చరిత్ర మనిషి సంఘర్షణలోని గెలుపు, ఓటములను ప్రతిబింబిస్తుంది. వినిమయ వాదం నిజమైన మేధా సంస్కృతిని వ్యతిరేకిస్తుందని యూకెన్ అంటాడు. మేధా కార్యకలపాలు మేధస్సు కోసమే. అలా కానట్టయితే అది పతనమౌతుంది. యూకెన్ కళా ప్రేమికుడు. సుఖవాదులకుపయోగపడే సౌందర్య వాదాన్ని యూకెన్ నిరసించాడు. తన విలువను గుర్తించని కళ నీతిని ఖండించ లేదు. అత్యున్నత కళాకారుడెవడూ జీవితం విషయంలో సౌందర్యవాదాన్ని అంగీకరించడు. మన రూనెబెర్గ్ హృదయ కవి. అతనికి విలువలను వొప్పుకోని కవిత్వం అంటే తెలియదు. నిజమైన మేధా సంపత్తితో కూడిన సంస్కృతిని పోషించుకున్న దేశాలే మానవజాతి ప్రగతికి దోహదం చేశాయి. ఆయుధాల మీద భవితవ్యాన్ని ఏర్పరుచుకున్న దేశాలు అశాశ్వత జీవితంలో శాశ్వతత్వాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని గుర్తించవలసి వుంటుంది. శాశ్వత సత్యాన్ని, జీవితాన్ని సిద్ధాంతాలుగా వ్యక్తీకరించే అధిభౌతికవాదాన్ని యూకెన్ నిరసించలేదు. అతను ఒక శాశ్వత మార్గాన్ని నిర్మించే ప్రయత్నం చేయలేదు. అతని కార్య తాత్త్వికత మానవ పరిణామంతో కలిసి పనిచేస్తుంది. అందు చేత అది డైనమిక్‌గా వుంటుంది.

ప్రొ॥ యూకెన్, మీ ఉన్నతమైన పాండితీ ఆదర్శాన్ని మీ గ్రంథాల్లో బలంగా వివరించారు. అందుకే స్వీడిష్ అకాడెమి ఈ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారాన్ని మీకు ప్రదానం చేస్తున్నది. మా అకాడెమి అభిమానంతో మీకు నమస్కరిస్తున్నది. భవిష్యత్తులో కూడ మీ రచనలు సంస్కృతికి మానవతకు దోహదం చేస్తాయని ఆశిస్తున్నది.

## జీవిత చరిత్ర

రుడోల్ఫ్ యూకెన్ (1846-1926) జర్మనీలోని ఆరిచ్‌లో జన్మించాడు. అతడు గోట్టిన్‌జెన్, బెర్లిన్ విశ్వవిద్యాలయాల్లో తత్త్వశాస్త్రం, భాషాశాస్త్రం, చరిత్ర అభ్యసించాడు. అరిస్టాటిల్ భాష మీద బెర్లిన్ విశ్వవిద్యాలయానికి పరిశోధనా వ్యాసం సమర్పించాడు. 1871లో బాస్లి విశ్వవిద్యాలయంలో తత్త్వశాస్త్రాచార్యుడయ్యాడు. 1874నుండి జెనా విశ్వవిద్యాలయంలో తత్త్వశాస్త్ర ప్రధానాచార్యు డయ్యాడు. యూకెన్ ఆదర్శవాద తత్త్వవేత్త. అతడు తన గ్రంథాలను కాలానుగుణంగా పునస్సమీక్షించాడు. అతని ప్రధాన రచనలు: ''మెయిన్ కరెంట్స్ ఆఫ మోడర్న్ థాట్'' 1908; ''ది ప్రాబ్లమ్ ఆఫ హ్యూమన్ లైఫ్ యాజ్ వ్యూడ్ బై గ్రేట్ థింకర్స్ ఫ్రమ్ ప్లేటో టు ది ప్రజంట్ డే'' 1890; ''ది స్ట్రగుల్ ఫర్ ఎ స్పిరిచువల్ కంటెంట్ ఆఫ్ లైఫ్'' 1896; ''ది ట్రూత్ ఆఫ్ రెలిజియన్'' 1901; ''లైఫ్ బేసిస్ అండ్ లైఫ్ ఐడియల్; ది ఫండమెంటల్స్ ఆఫ్ న్యూ ఫిలాసఫి ఆఫ్ లైఫ్'' 1907; ప్రజంట్ డే ఎథిక్స్ ఇన్ దేర్ రిలేషన్ టు ది స్పిరిచువల్ లైఫ్'' 1913; ''ది మీనింగ్ అండ్ వాల్యూ ఆఫ్ లైఫ్'' 1908; ''కాంటెంపోరరీ సివిలిజేషన్'' 1907.

# చరిత్రకారునిగా కంభంపాటి సత్యనారాయణ

(గత సంచిక తరువాయి) -టి. రవిచంద్

ఐదు దశాబ్దాలు కమ్యూనిస్టు పత్రికల్లో గడించిన రచనానుభవం నుంచి ఒక పరిశోధకుడిగా కంభంపాటి సత్యనారాయణ ఎదిగి A Study of the History and Culture of the Andhras (ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి: ఒక అధ్యయనం) అనే గ్రంథాన్ని తమ జీవిత చరమ దశలో రచించారు. దాదాపు వెయ్యి పేజీల (937 పేజీల) ఈ ఉద్గ్రంథం రాశి (Quantity) లోనే కాదు, వాసి (Quality) లోనూ విలక్షణ గ్రంథం. ఈ ఉద్గ్రంథాన్ని తెలుగులోకి అనువాదం చేస్తూ, మహీధర రామమోహనరావు **నా మాటలో** ఒక ముఖ్యమైన విషయాన్ని మనందరికి మరొకసారి గుర్తుచేశారు. ఆ మాటల్ని కమ్యూనిస్టులేకాదు, దేశ ప్రగతిని కాంక్షించే వారందరు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన మాటల్లోని అంతరార్థాన్ని గురించి లోతుగా, నిర్మొహమాటంగా చర్చించాల్సిన తరుణం ఆసన్నమయింది. ఆ మాటల్లోని స్ఫూర్తిని మనం స్వీకరించగలిగినట్లయితే, కీ॥శే॥ కంభంపాటి ఒకటిన్నర దశాబ్దాలు పైగా ఆంధ్రుల చరిత్ర, సంస్కృతిపై చేసిన పరిశోధన సార్థకమవుతుంది. **నామాటలో** మహీధర రామమోహనరావు కంభంపాటి **ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి** గురించి చెబుతూ ఆలోచనాత్మకంగా ఈ మాటలు రాశారు: ''మిత్రులు కంభంపాటి సత్యనారాయణ గారు వ్రాసిన ఈ పుస్తకం చదివినప్పుడిది తెలుగులోకి వస్తే బాగుంటుందనుకున్నాను. మన సామాజిక నిర్మాణ సమస్యలలో కొన్నింటికి సమాధానం ఇందులో దొరికిందనిపించింది. తెలుగు వాళ్ళు ముఖ్యంగా అభ్యుదయోద్యమంలో పనిచేస్తున్న వాళ్ళకి ఆ సామాజిక పరిజ్ఞానం అత్యవసరం. భారత దేశంలో బానిస విధానం ఉండేదా? ఏ రూపంలో ఉండేది? వంటి సమస్యలు పరిశోధకులవి. సాధారణుడైన తెలుగువాడి నిత్య జీవిత పరిజ్ఞానంలో వాని పాత్ర బహుదూరం. కాని మన జీవితాన్ని ఆవరించుకొని, ముందుకు అడుగువేయకుండా నిరోధిస్తున్న కొన్ని సమస్యలున్నాయి. వానిలో కులం ఒకటి. మానవులంతా ఒక్కటే. వారిలో హెచ్చుతగ్గులు లేవు, ఉండకూడదనే వాళ్ళు కూడా కులం పేరు చెప్పేసరికి బిగిసిపోతున్నారు'' (**ఆంధ్రుల సంస్కృతి-చరిత్ర-1**, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, 1981 XIX). అంతేకాకుండా కంభంపాటి ఉద్గ్రంథాన్ని గురించి మరో మాటకూడా ఆయన అన్నారు: ''ఈ ప్రశ్నలకు సమగ్ర సమాధానం ఉందనను కాని వీనిని అర్థం చేసుకొనేందుకు, సమాధానం ఊహించుకొనేందుకూ కావాల్సిన సమాచారం నాకు కనపడింది.'' (పే XX). అభ్యుదయోద్యమాలలో తల నెరిసిన పెద్ద రచయిత మహీధర రామమోహనరావు గుర్తించినట్టు కంభంపాటి సత్యనారాయణ ఆంగ్ల గ్రంథం **ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి: ఒక అధ్యయనం** చారిత్రక ప్రాముఖ్యతను మరో అభ్యుదయ రచయిత కాని, కమ్యూనిస్టు యోధుడు కాని గుర్తించినట్లు నా దృష్టికి రాలేదు. ఆయనే ఈ గ్రంథాన్ని సంక్షిప్తానువాదంగా కాకుండా సంపూర్ణానువాదం చేసినట్లయితే ఆంగ్ల భాష తెలియని తెలుగు పాఠకులు వర్గ, కుల, మత వ్యవస్థలు గురించి తమ పరిజ్ఞానాన్ని పరిపుష్టంచేసుకోవడానికి, అవగాహనను

---

టి. రవిచంద్, గుంటూరు.

పెంచుకోవడానికి తగిన సమాచారం అందించినట్లయ్యేది. ఆంధ్రుల సమగ్ర చరిత్రకు మార్క్సిస్టు దృష్టిలో నాంది పలికిన కంభంపాటి చరిత్ర గ్రంథం, ఈనాడు దేశం ఎదుర్కొంటున్న విచ్ఛిన్నకరశక్తులు- కుల, మతాల్ని అర్థం చేసుకొని వాటికి వ్యతిరేకంగా బహుముఖ పోరాటం చేయడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నాను. మతాన్ని గురించి చెబుతూ (కుతుబ్-శాహీయుగం) కంభంపాటి ఆసక్తికరమైన ఒక విషయం మన దృష్టికి తెచ్చారు: ''ఆనాడు మతం అనేది రాజ్యవిస్తరణకొక సాధనం మాత్రమే. అహోబిలం దేవాలయాన్ని కూలగొట్టింది ఒక బ్రాహ్మణ సేనాని.'' భక్త రామదాసుగా ప్రసిద్ధుడైన కంచెర్ల గోపన్న రామభక్తుడు. రామభక్తిలో పడి తన ఉద్యోగ ధర్మం మరిచి వసూలయిన ప్రభుత్వ శిస్తుతో భద్రాచల రామాలయాన్ని పునరుద్ధరించేడు. అబుల్‌హసన్ కాలంలో ఆయన పాల్వంచ పరగణాకు తహసిల్దారు. అధికార దుర్వినియోగానికి పాల్పడినందుకు సుల్తాను ఆయనను జైలులో పెట్టాడు. దాదాపు 12 సంవత్సరాలు జైలులో బాధలనుభవించాడు. చివరకు రామదాసు ఏమయ్యాడనే విషయంపై భిన్న కథనాలు ప్రచారంలో ఉన్నాయి. బ్రిటిష్ చరిత్రకారులతో పాటు హిందూ మతాభిమానులు రామదాసు ఆ క్రూరహింసలకు తాళలేక జైలులోనే మరణించాడని ప్రచారం చేశారు. ఇప్పటికీ చేస్తున్నారు. కాని కంభం పాటి సత్యానారాయణ తమ పరిశోదనలో మరో ఆసక్తికరమైన విషయం శాసనాధారంతో భక్తరామదాసు గురించి వెలుగులోకి తెచ్చారు : ''రామదాసును జైలు నుంచి విడుదల చేయడమే కాక సుల్తాను భద్రాచలం రామాలయానికి కొన్ని ఊళ్ళు ఇచ్చి రామదాసుని ట్రస్టీగా నియమించినట్లు తెలిపే శాసనం ఒకటి ఇటీవల వంగూరు సుబ్బారావు గారికి దొరికింది'' (**తెలుగు అనువాదం-II**, పేజీలు 58-59, **ఆంగ్లమూలం** పేజీలు : 543-544). రాజు హిందువయినా, ముస్లిం అయినా నిరంకుశంగానే పరిపాలించే వారని, రాజ్య విస్తరణే వాళ్ళ ప్రధాన లక్ష్యమని మనం గుర్తించాలి. లేకపోతే ఇటువంటి చారిత్రక వాస్తవాలు రాసినందుకు చరిత్రకారులపై, వారి గ్రంథాలపై దాడిచేసే అనాగరిక మనస్తత్వం ప్రజల్లో ప్రేరేపించ బడుతుంది. ఈ విషయంలో ప్రజలు, చరిత్ర పరిశోధకులు నిత్యం అప్రమత్తతతో ఉండాలి. లేకపోతే పూణెలోని భండార్కర్ ఓరియంటల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ (BORI) పై శంభాజి బ్రిగేడ్ చేసిన అమానుషమైన దాడిలాంటిది నిష్పక్షిక చరిత్రకారులందరూ ఎదుర్కోవాల్సి ఉంటుంది. జేమ్స్‌లేన్ అనే రచయిత తన పరిశోధనా గ్రంథం **శివాజీ- ది హిందూ కింగ్ ఇన్ ఇస్లామిక్ ఇండియాలో** శివాజీ జనకత్వం (Parentage) పై కొన్ని సందేహాలు వ్యక్తీకరించాడు. ఇది చాలా సున్నితమైన సమస్య. అసలు అటువంటి చర్చే అర్థరహితం. ఒకవేళ అటువంటి చర్చను ఏ ఉద్దేశ్యంతో లేవదీసినా, భారత చరిత్రలో శివాజీ ఔన్నత్యానికి ఏర్పడే మచ్చ ఏమీ లేదు. ఆయన తండ్రి ఎవరయినా చరిత్రలో శివాజీ శివాజీగా శాశ్వత స్థానం పొందాడు. ఈ విషయాలేవీ పట్టించుకోకుండా మతం ముసుగులో ఉన్న కులోన్మాదులు తమ ప్రాచీన చరిత్రకు చెందిన అపారమైన సంపదను పరిరక్షిస్తున్న ఒక గొప్ప సంస్థపై, శివాజీ జీవిత చరిత్రగా ప్రసిద్ధి చెందిన **శివభారతాన్ని** సంస్కృతం నుండి ఆంగ్లంలోకి అనువదించిన సంస్కృత పండితుడు, చరిత్రకారుడైన ఎస్. బహుల్కర్‌లపై దాడిచేసి చరిత్రను అవమానపరిచారు. ఈ వ్యాఖ్యకు ఆధారం భండార్కర్ ఓరియంటల్ రీసెర్చి సభ్యులు అందించిన సమాచారం కాబట్టి ఆ ఇన్‌స్టిట్యూట్‌పైన, సభ్యులపైన

శంభాజీ బ్రిగేడ్, శివసేన కార్యకర్తలు ఫాసిస్టు దాడిచేశారు. భండార్కార్ ఓరియంటల్ ఇన్స్టిట్యూట్ ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక పరిశోధనా సంస్థ. ఈ సంస్థ కొన్ని దశాబ్దాలు పరిశోధన చేసి మహాభారత సంశోధన ప్రతిని ప్రచురించింది. ఈ సంస్థ గ్రంథాలయంలో అమూల్యమైన యనభైవేల రాతప్రతులు, లక్షాయనభయివేల గ్రంథాలున్నాయి. అరుదైన ఋగ్వేద అనువాదం ఇక్కడ ఉంది. ఋగ్వేద అనువాదం శంకరాచార్యుడి పేరుతో ఉన్నదని **ది హిందూ** సంపాదకీయం పేర్కొనగా, శనాచార్యుడని **టైమ్స్ఆఫ్ ఇండియా** వార్తా కథనం! నిజానికది సాయణాచార్యుడి ఋగ్వేదానువాదం (ఋగ్వేదభాష్యం) అయి ఉండవచ్చు. ఈ సాయణాచార్యుడే విజయనగర వ్యవస్థాపకుడుగా మనం చెప్పుకొనే విద్యారణ్యుడి సోదరుడు. కాదు ఇద్దరూ ఒక్కరే అనే సనాతన పండితులూ ఉన్నారు. ఆ చర్చ ఇప్పుడనవసరం. ఈ హిందూ కుల ఉన్మాదులు ఈ రాతప్రతిని కూడా ధ్వంసం చేయడానికి ప్రయత్నించారు. తమ ఉన్మాదంతో తమ వారసత్వాన్ని కూడా నాశనం చేసుకొంటున్న వీరి గురించి **ది హిందూ** దినపత్రిక ఒక సంపాదకీయంలో మతోన్మాదుల్ని తీవ్రంగా హెచ్చరించింది. మహాభారత యుద్ధం చివరిదశలో యాదవులు తమను తామే నరుక్కొని చచ్చినట్టు, భండార్కార్ ఓరియంటల్ రీసెర్చిపై దాడిచేసిన ఈ శంభాజీ మూక ఆ సంఘటనను తలపింపచేశారు! (చూడు: **ది హిందూ,** Vandalism in Pune, జనవరి 10, 2004). నిజమే లేకపోతే తమ చరిత్ర, సంస్కృతులకు ఆధారమయిన ప్రాచీన రాతప్రతుల్ని దశాబ్దాలుగా పరిరక్షిస్తున్న ఇటువంటి గొప్ప సంస్థపై దాడి చేయగలుగుతారా? ఆలోచించండి. మహాభారతంలోని కొన్ని ముఖ్య పాత్రల్ని మనో విశ్లేషణ చేస్తూ **యుగాంత** (తెలుగు యుగాంతం) పేరుతో ఐరావతీకర్వే రచించిన గ్రంథానికి ఆధారం కూడా పూణెలోని భండార్కార్ ఓరియంటల్ఇన్స్టిట్యూట్ ప్రచురించిన పరిష్కృత **మహాభారత**ప్రతే! ఇటువంటి ఫాసిస్టు ఉన్మాద చర్యలు మరల పునరావృతం కాకుండా ఉండాలంటే కరభంపాటి విజయనగర, కుతుబ్-శాహి యుగాల గురించి రాసిన చారిత్రక వాస్తవాలు ప్రజనీకంలో, విద్యావంతులలో విస్తృత ప్రచారం కావాలి. ఈ రెండు యుగాల గుర్తించి చెప్పేటప్పుడు చాలామంది చరిత్ర కారులు, విద్యావంతులు వీటిని హిందూ, ముస్లిం రాజ్యాలుగా పరిగణించడం పరిపాటి. కాని విజయనగర పాలకుల, కుతుబ్-శాహి రాజుల మత, తాత్విక విధానాల్ని పరిశీలిస్తే, రాజ్య విస్తరణ సమయంలో తప్పితే ఇతర సమయాల్లో మత పరమైన విభేదాలు కనిపించవు. ఈ రెండు రాజ్యాల పాలకులకు మతమౌఢ్యంలేదు. ఇతర మతాల్ని సహించారు. ఆదరించారు. రామరాయలు కాలంలో ఒకసారి కొంతమంది ముస్లింలు అనాలోచితంగా ఒక ఆవుని చంపారు. ఈ సంఘటనను వ్యతిరేకిస్తూ, ఆయన తమ్ముడు తిరుమలరాయలు గోవధను నిషేధించాలని ఆందోళన లేవదీశాడు. రామరాయలు ఆ ఆందోళనకారులను సమావేశపరచి, శాంతింపచేయడమే కాకుండా, తన ప్రజలయిన ముస్లింల మనోభావాల్ని గాయపరచుకూడదని వాదించాడు. కాని నేటి ఈ ఆధునికి పాలకుల పరిపాలనలోని కౌటిల్యాన్ని గమనించండి. వీళ్ళ మనస్తత్వాలు ఎంత దారుణంగా కనిపిస్తాయి! విజయనగర యుగంలో రామరాయలు ప్రదర్శించిన విజ్ఞతను నేటి మన పాలకులు మత విశ్వాసాల విషయంలో కనబరిస్తే మతాల పేరుతో, కులాల పేరుతో దేశం ఇలా ఎందుకు విచ్ఛిన్నమవుతుంది? ఐతే కొంతమందికి ఒక సందేహం కలగవచ్చు.

రాక్షసి- తంగ్డి యుద్ధంలో ఇద్దరు ముస్లిం సేనానాయకులు విద్రోహం వల్లేకదా ఓటమి పాలయిందని. ఈ ప్రశ్నకు కంభంపాటి ఎంత విలువైన సమాధానం ఇచ్చారో చూడండి: ''రాక్షసి - తంగ్డి యుద్ధంలో ఇద్దరు ముస్లిం సేనానాయకులు చేసిన ద్రోహచర్య ఈ మత సామరస్య విధానానికి ఓటమిగా భావించనక్కర్లేదు. ఎక్కడున్నా ఫ్యూడల్ వ్యవస్థలో ఈ ద్రోహాలు, తిరుగుబాట్లూ మామూలే. యుద్ధంలో సేనాధిపతుల ద్రోహంకన్న రామరాయలు మూర్ఖంగా చేసిన తప్పిదాలే ఆయన పరాజయానికి కారణాలు'' (పేజీ 68, **తెలుగు అనువాదం;** విజయనగర యుగం). అదే సమయంలో శూద్రకులంలో జన్మించి, వర్ణ, కుల వ్యవస్థల్ని నిరసించిన వేమన గురించి చెబుతూ, ''కులముగల్గువారు, గోత్రంబు కలవారు పసిడిగలవాని బానిస కొడుకుల్' అంటూ వర్ణాల ప్రాభవం పోయి, వర్గాల ప్రాభవం ఏర్పడడాన్ని గమనించిన మొదటి తెలుగు కవి ఈయన (వేమన)'' అని భావించారు. ఐతే వేమన శైవుడు అనే కంభంపాటి అభిప్రాయాన్ని అంగీకరించలేము. వేమన మత విశ్వాసాలపై ఇంకా అన్ని కోణాల్లో పరిశోధన జరగాల్సి ఉంది. ఇప్పటికే తెలుగులో వేమనపై చాలా మౌలిక పరిశోధన జరిగిందనే చెప్పాలి. ఐనాకూడా వేమన తాత్విక దృక్పథం, మత విశ్వాసాలపై ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నాము. ఆయన అవైదిక సాంప్రదాయానికి చెందిన **ఆజీవకుడా** అనే సందేహం ఈ మధ్య నాకు కలుగుతుంది. ఆయన నగ్న రూపం ఆజీవక మత ధోరణికి అతి సన్నిహితంగా కనిపిస్తోంది. మరుగునపడిన ఈ ఆజీవక తాత్విక సాంప్రదాయంపై ఎ.ఎల్. భాషామ్ మౌలిక పరిశోధన చేసి తన గ్రంథాలలో వెల్లడించారు. ఆస్ట్రేలియాకు చెందిన ఈ మహా పండితుడితో ప్రత్యక్ష పరిచయం ఉన్న బూదరాజు రాధాకృష్ణ ఆయన గురించి తమ **విన్నంత, కన్నంత** (స్వీయచరిత్ర) లో రాశారు. మహా పండితులం అనుకొని విర్రవీగే వారంతా ఆ నాలుగు మాటలు చదివితీరాలి. ఆజీవక సంప్రదాయంలో ద్రవిడ ఆజీవక సంప్రదాయం ఉందని భాషామ్ తెలిపారు. ఈ ద్రవిడ ఆజీవకులు మహాయానాన్ని పోలిన సిద్ధాంతాల్ని అభివృద్ధి చేశారు. **విశ్వదాభిరామ వినురవేమ** (వేమన అంతరాంతరాల్లో) లో త్రిపురనేని వెంకటేశ్వరరావు వేమనను శూన్యవాదిగా (మహాయానంలో మాధ్యమక బౌద్ధశాఖ) నిరూపించడానికి ప్రయత్నించిన విషయం మనలో చాలా మందికి తెలుసు. ఆజీవకులే ప్రాచీన భారతంలో నగ్నంగా తిరుగుతూ తాత్విక బోధ చేసేవారు. జైనంలో దిగంబర శాఖ ఉన్నా, దానికి సామాజిక జీవితంతో ఎటువంటి సంబంధం లేదు. కాబట్టి వేమన జైనమత శాఖకు చెందిన వాడు కాదని చెప్పవచ్చు. శైవుడూ కాదు.

కాకతీయ యుగంలో తిక్కన జీవించాడు. ఆయన మహాభారతాన్ని తెలుగులోకి అనువదించిన సంగతి మనకు తెలుసు. తెలుగు వారి కవిత్రయంలో ఆయనొకడు. ఆయన్ని మత సమన్వయవాదిగా చాలామంది చరిత్రకారులు, రచయితలు చిత్రిస్తుంటారు. ఆయన కవిగా గొప్పవాడే కావచ్చు. కేవలం భాషాదృష్టితో చూసి తిక్కనను ప్రజాకవిగా భావించిన మహాకవి శ్రీశ్రీ ఉన్నాడు. తిక్కన భావజాలం రీత్యా సనాతనవాది. ఆయన మత సమన్వయం వైదిక మత శాఖల మధ్యే కాని వైదిక, అవైదిక మత శాఖల మధ్య కాదు. ఈ విషయం సరిగా గుర్తించని కొంతమంది చరిత్రకారులు ఆయనను మత సమన్వయవాదిగా చిత్రిస్తుంటారు. ఈ విషయం గురించి రాస్తూ కంభంపాటి ''మహాభారత రచయిత

తిక్కన గణపతిదేవుని ఆస్థానంలో బౌద్ధుల్ని (జైనులయి ఉంటుంది) వారి దేవాలయాలను ధ్వంసం చేయించాడు.'' (**కాకతీయ యుగం, తెలుగు అనువాదం- II, పేజీ : 66, ఆంగ్ల మూలం - II పేజీ : 84**). ఇతర మతాల కట్టడాల్ని కూలదోయించి, వారిని నానా నరకయాతనలకు గురిచేసిన తిక్కన మత సమన్వయవాది. ప్రజాకవి! సామాజికంగా తిక్కన చాలా ఛాందసుడు. ఆయన తన మహాభారతానువాదంలో గీతను పూర్తిగా ఎందుకు అనువాదం చేయలేదో ఒక్కసారి విజ్ఞులు ఆలోచించాలి. ఈ విషయంపై తెలుగు పండితులు, పరిశోధకులు భిన్నాభిప్రాయాలు ప్రకటించినా, తిక్కన సామాజిక దృష్టిని నిశితంగా పరిశీలిస్తే, ఆయన సంపూర్ణ గీతానువాదం ఎందుకు చేయలేదో బోధపడుతుంది. ఈ అంశంపై కంభంపాటి నిశితంగా లోతైన పరిశోధన చేయలేదు. ''కవిత్రయం వారు కులతత్వ ప్రచారకులు'' అన్న సురవరం ప్రతాపరెడ్డి అభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. కంభంపాటి తమ పరిశోధనలో సంస్కృతికి కూడా సమస్థానం కల్పించి అనేక విషయాలు వెలుగులోకి తెచ్చారు. కనుక ఈ అంశంపై ఆయన దృష్టి పడి ఉంటే మరుగున పడిన విషయాలు వెలుగులోకి వచ్చి ఉండేవి. ఏ చారిత్రక పరిశోధనలోనయినా మన చరిత్రకు సంబంధించిన సకల ప్రశ్నలకు సమాధానం లభిస్తుందనుకోవటం అత్యాశే కాగలదు. గత చారిత్రక పరిశోధకులు విభిన్న కారాణాలతో వదిలేసిన ప్రశ్నల్ని తర్వాత వచ్చిన తరం పట్టించుకోవాలి. ఆదిశగా చరిత్ర పరిశోధన చేయాలి.

ఇంతవరకు కంభంపాటి సత్యనారాయణ **Hisory and Culture of the Andhras**లో వివిధ యుగాల్లోని కొన్ని విశేషాలు పరిశీలించాం. ఇప్పుడు ఆంధ్ర చరిత్ర పరిశోధనలో ఆయన ఎంచుకున్న పరిశీలనా పద్ధతిని చూద్దాం. గతితార్కిక భౌతిక వాద దృక్పథం నేపథ్యంలో చరిత్రను, సమాజాన్ని అధ్యయనం చేసే సిద్ధాంతం - చారిత్రక భౌతికవాదం. ఈ సందర్భంగా మార్క్సిస్టు మహోపాధ్యాయుల్లో ఒకరైన ఎంగెల్స్ అన్న మాటల్ని ప్రతి చారిత్రక భౌతికవాది గుర్తు పెట్టుకోవాలి: ''మొత్తం మీద జర్మనీలో పలువురు రచయితలకు ''భౌతికవాదం'' అన్న పదం నినాదప్రాయమై పోయింది. ఇతోధికమైన అధ్యయనం లేకుండా వాళ్ళీ పదాన్ని ప్రతి ఒక్క దానికీ తగిలిస్తారు. అంటే ఈ పదాన్ని తగిలించి, దానితో ఆ సమస్య పరిష్కారమై పోయినట్లు పరిగణిస్తారు. కాని మన చారిత్రక భౌతికవాదం అన్నిటికన్న ముఖ్యంగా అధ్యయనానికి మార్గదర్శియే గాని, హెగెలియన్ల మాదిరిగా నిర్మాణానికొక కిటుకుకాదు'' (**సి.ష్మిడ్ట్‌కు ఎంగెల్స్ 1890లో రాసిన లేఖ**). దీని ప్రకారం ఉత్పత్తి విధానం సమాజానికి పునాది. మార్క్స్ తాను యూరోప్ చరిత్రను పరిశీలించి గుర్తించిన ఉత్పత్తి విధానాలు : ఆదిమ కమ్యూనిజం, బానిస విధానం, ఫ్యూడల్ విధానం, పెట్టుబడిదారీ విధానం. ఐతే మార్క్స్ భారతదేశంలోని సమాజాన్ని విశ్లేషించేటప్పుడు ఏసియాటిక్ అనే ఉత్పత్తి విధానాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నాడు. భారతీయ మార్క్సిస్టు మేధావులు, చరిత్రకారులు మార్క్స్ యూరోప్‌కు సంబంధించి చెప్పిన క్రమాభివృద్ధి దశల్ని (ఆదిమ కమ్యూనిజం, బానిస సమాజం...) యాంత్రికంగా భారతదేశ చరిత్రకు అన్వయించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు. అటువంటి మార్క్సిస్టు

పరిశీలనా పద్ధతికి ఆద్యులు ఎస్.ఎ. డాంగే. ఆయన 1949లో రచించిన **ఇండియా ఫ్రమ్ ప్రిమిటివ్ కమ్యూనిజం టు స్లేవరి** (భారతదేశం : ఆదిమ కమ్యూనిజం నుంచి బానిస విధానం వరకు)లో మార్క్స్ యూరప్‌కు సంబంధించి పేర్కొన్న క్రమాభివృద్ధి దశల్ని మన చరిత్రకు అన్వయించి వ్యాఖ్యానించారు. కేవలం ప్రాచీన సాహిత్యంపై ఆధారపడి ప్రాచీన భారతంలో ఆదిమ కమ్యూనిస్టు, బానిస వ్యవస్థల్ని చిత్రించడానికి డాంగే ప్రయత్నించారు. కారల్‌మార్క్స్ 1853 నుంచి తన వ్యాసాల్లోనూ, గ్రంథాల్లోనూ ప్రత్యేకంగా వర్ణించిన ప్రాచ్య సమాజం లేదా ఆసియా సమాజం గురించి డాంగే తమ రచనలో కనీసం పట్టించుకోలేదు. ఈ రెండు కారణాల వల్ల ఆయన చరిత్ర రచనలో తీవ్ర తప్పిదాలు చేశారు.

డాంగే చారిత్రక పరిశీలనా పద్ధతిపై **మార్క్సిజం అండ్ ఏన్షియంట్ ఇండియన్ కల్చర్** (మార్క్సిజం-ప్రాచీన భారత సంస్కృతి) లో డి.డి. కోశాంబి తీవ్ర విమర్శ చేశారు. (**D.D.Kosambi on History and Society : Problems of Interpretation,** Edited by : A.J. Syed, Depart of History, University of Bombay Publication, Bombay, 1985). డాంగే పుస్తకం "Painfully disappointing book" (పేజి :74)గా డి.డి. కోశాంబి తలచారు. ఈ వ్యాసాన్ని ఆయన **అన్నల్స్ ఆఫ్ ఓరియంటల్ భండార్కర్ రీసెర్చి ఇన్స్టిట్యూట్** (1949) లో తొలిసారి ప్రచురించారు. ఆనాటి నుండి భారత చరిత్రను పరిశీలించే రెండు భిన్న మార్క్సిస్టు చారిత్రక పరిశీలనా పద్ధతులు ఈ దేశంలో ఏర్పడ్డాయని భావించవచ్చు. డాంగే పరిశీలనా పద్ధతిని అనుసరించే మార్క్సిస్టు చరిత్రకారులున్నారు. అందుకు భిన్నంగా ఆలోచించే కోశాంబి మార్గంలో పరిశోధన చేస్తున్న చరిత్రకారులున్నారు. ప్రొఫెసర్ కె. సచ్చిదానందమూర్తి ఈ మార్క్సిస్టు పరిశీలనా పద్ధతిని మార్క్సిస్టు కోశాంబి సిద్ధాంతం అన్నారు (చూడు : కంభంపాటి **ఆంగ్ల మూలం.** Vol. I.P.IV). ఇక్కడ డి.డి. కోశాంబి గురించి నాలుగు మాటలు చెప్పుకోవాలి. డేల్ రీప్ (Dale Riepe) అనే అమెరికన్ మార్క్సిస్టు ఇండాలజిస్ట్ కోశాంబిని ''ఫాదర్ ఆఫ్ సైంటిఫిక్ ఇండియన్ హిస్టరి'' (శాస్త్రీయ భారత చరిత్ర పితామహుడు)గా అభివర్ణించాడు. ఆయన తండ్రి డి. కోశాంబి బౌద్ధపండితుడు. చరిత్రకారుల్లో మార్క్సిస్టు కోశాంబికి ఎంత పేరుందో, అంత పేరు పాలీ భాషా పండితుల్లో బౌద్ధుడైన కోశాంబికి ఉంది. నిజానికి తండ్రీ తనయులు ఒకరిని మించిన వారు మరొకరు. తండ్రి బౌద్ధుడు. తనయుడు మార్క్సిస్టు. ఇదీ నిజమైన మానవ వారసత్వం. భారత చరిత్ర పరిణామం కూడా ప్రాచీన బౌద్ధం నుంచి ఆధునిక మార్క్సిజానికే మహా ప్రస్థానం చేయాలి. డి.డి. కోశాంబి పిడివాద మార్క్సిస్టు కాదు. క్రిటికల్ మార్క్సిస్టు. అందువల్లే నిష్పాక్షిక దృష్టిగల సమకాలిక భారత మేధావులందర్నీ ఆయన చారిత్రక పరిశీలనా పద్ధతి విశేషంగా ప్రభావితం చేసింది. సుప్రసిద్ధ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు తమ జీవిత చరమదశలో రచించిన **The Truth About the Gita** (రచనా కాలం 1984, తొలి ముద్రణ 1988) గ్రంథాన్ని డి.డి. కోశాంబికి (ఈయన తండ్రి డి. కోశాంబికి కాదు) అంకిత మిచ్చారు. నార్ల మరణానంతరం ప్రచురించబడిన ఈ గ్రంథంలో డి.డి. కోశాంబికి బదులు Dedicated to D. Kosambi అని అచ్చు తప్పు దొర్లి, మార్క్సిస్టైన తనయుడికి కాకుండా బౌద్ధుడైన తండ్రికి నార్ల అంకితమిచ్చారన్న అభిప్రాయం కొంతమందికి ఏర్పడింది. 1956-1974 సంవత్సరాల

మధ్యకాలంలో నార్ల ''విశ్వాసాలలో వచ్చిన మార్పుల'' ను గుర్తించని కీ॥శే॥ చలసాని ప్రసాదరావు లాంటి వాళ్ళు ఆయనను ఇంకా ''పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేకి ఎడిటర్ నార్ల''గానే భావిస్తున్నారు. చరిత్ర పరిశోధనలో మార్క్సిస్టు దృక్పథాన్ని అన్వయించటంలో తప్పు లేదని డి.డి. కోశాంబి **యాన్ ఇంట్రడక్షన్ టు ది స్టడీ ఆఫ్ ఇండియన్ హిస్టరి**ని సమర్థిస్తూ రాజ్యసభలో నార్ల ప్రసంగించారు. ఈ పుస్తకం కంభంపాటి సత్యనారాయణను అమితంగా ప్రభావితం చేసింది. ఒక దశలో ఆయన దీన్ని తెలుగులోకి అనువాదం చేద్దామనుకున్నారు.

కంభంపాటి సత్యనారాయణ పరిణత వయస్సులో మార్క్స్ ప్రయోగించిన ''ఏషియాటిక్ సొసైటి'' (ఆసియా సమాజం) అనే భావనను ప్రాతిపదిక చేసుకొని ఆంధ్రుల చరిత్ర, సంస్కృతిని పరిశోధించి గ్రంథ రచన చేశారు. ఇది స్వతంత్ర మౌలిక పరిశోధన. కమ్యూనిస్టు ఉద్యమంపై డాంగే గ్రంథానికి ఉన్న పట్టు సామాన్యమైంది కాదు. రాజకీయంగా ఆయనను విమర్శించేవారు సయితం ఆ గ్రంథ ప్రభావం నుండి బయట పడలేదు. మార్క్స్ భారతదేశంపై రాసిన వ్యాసాల్లోనూ, ఇతర రచనల్లోనూ పేర్కొన్న ఆసియా సమాజం (ఏషియాటిక్ సొసైటి) భావన, మన దేశంలోని స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థకు సమానంగా కంభంపాటి భావించారు. ఈ స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ ఆంధ్ర రాష్ట్రంలో శాతవాహన యుగానంతరం ఏర్పడి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు భారతదేశంలో అడుగుపెట్టే వరకు కొనసాగింది. మార్క్స్ పేర్కొన్న ఆసియా (ప్రాచ్య) సమాజానికి ఉన్న ముఖ్య లక్షణాల్ని బ్ర్యాన్ ఎస్. టర్నర్ ఇలా వివరించారు. 1. వ్యక్తిగత ఆస్తి లేకపోవటం (భూమిపై వ్యక్తిగత యాజమాన్యం లేదు), 2. నీటిపారుదల వ్యవస్థపై ప్రభుత్వాధిపత్యం, 3. గ్రామాలు స్వయం సమృద్ధం, 4. వ్యవసాయం, చేతిపనుల మధ్య ఐక్యత, 5. ఉత్పత్తి పద్ధతులు సరళం. భూమిపై వ్యక్తిగత హక్కు లేదన్న మార్క్స్ అభిప్రాయంతో కోశాంబి విభేదించారు. దీనిపై మార్క్స్ తరవాత కాలంలో తన అభిప్రాయం మార్చుకున్నాడని కంభంపాటి వివరించారు. బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ తన దోపిడీని సుస్థిరం చేసుకొనేందుకు దీన్ని నిర్మూలించిందని మార్క్స్ తన లేఖాల్లో తెలిపాడు. ఈ స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రదేశంలో శతాబ్దాలు అమల్లో ఉండడం వల్ల ప్రపంచంలోని ఇతర దేశాలు ఎదుర్కొనని అనేక సమస్యల్ని మనం ఎదుర్కొన్నాం. మన సామాజిక నిర్మాణానికి సంబంధించిన కొన్ని సమస్యలు ఈ స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ అవశేషాలే. ఈ స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థలో కులం, వర్ణం ఒకరకంగా ప్రాచీన ఉత్పత్తి సంబంధాలు. ఈ రోజు కులం ఉపరితల అంశంగా పరిణామంచెందినా, దాని ప్రభావం నుండి భారతీయులు బయటపడలేకపోవడానికి ప్రధాన కారణం - పునాదికిచెందిన కులం ఉపరితల అంశంగా మారడం వల్ల, దాని బలం ఎక్కువగా ఉంది. భారతదేశంలోని కుల వ్యవస్థను అర్థం చేసుకోవడానికి మార్క్స్ ప్రతిపాదించిన స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ అనే భావన బాగా ఉపయోగపడుతుందని నేను భావిస్తున్నాను. ఈ భావన మార్క్స్ పరిపక్వం చెందని తొలినాటి భావాలకు సంకేతమని కీ॥శే॥ బలరామమూర్తి భావించి, కంభంపాటి రచనపై విమర్శ చేశారు. ఈ విషయంపై కంభంపాటి -

ఏటుకూరు బలరామమూర్తిల మధ్య **కమ్యూనిజం** (ఏప్రిల్, జూలై 1976 సంచికలు)లో ఆలోచనాత్మకమైన చర్చ జరిగింది. ఈ వ్యాసాల్ని సి. వి. 1983లో **స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ: మార్క్స్** పేరుతో రాసిన పుస్తకంలో పొందుపరిచారు. కాని ఈ విషయంపై ఆంధ్ర మార్క్సిస్టులు నిశితమైన చర్చను కొనసాగించ లేక పోయారు. వీరిద్దరితోనే ఆ చర్చ ఆగిపోయింది. మార్క్స్ ప్రతిపాదించిన ఈ భావనను పూర్తిగా తిరస్కరించడమంటే భారత చరిత్రలో ఈనాటికీ అర్థం కాకుండా పోయిన కొన్ని ప్రత్యేకతల్ని విస్మరించడమే. ఈ భావనను మార్క్స్ 1853 నుండి తన అనేక ఇతర రచనల్లో పేర్కొన్నారు. ఐతే **యాన్ ఇంట్రడక్షన్ టు ది స్టడీ ఆఫ్ ఇండియన్ హిస్టరి** గ్రంథ రచయిత డి.డి.కోశాంబి ఆసియా ఉత్పత్తి విధానం అనే మార్క్స్ భావనను పూర్తిగా ఆమోదించలేదు. మార్క్స్ భావనలో కొన్ని ప్రధాన సవరణలతోనే దీన్ని ఆయన అంగీకరించారు. ఈ భావనకు సంబంధించి ప్రోగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో 1979లో **ప్రి-కాపిటలిస్ట్ సోషియో - ఎకనమిక్ ఫార్మేషన్స్** పేరుతో ఒక సంకలనం ప్రచురించింది. ఈ సంకలనాన్ని పరిచయంచేస్తూ నొరైర్ తెర్- అకోప్యాన్ "The Asiatic mode of production is at the present time an object of close study and controversy in Marxist sciences" అన్నారు. ఈ భావనను 1853 నుంచి 1867 (కాపిటల్ రచన వరకు) సందర్భం వచ్చినప్పుడల్లా మార్క్స్ పేర్కొన్నారని గుర్తించలం. అందువల్ల దీనిని కేవలం అపరిణత భావనగా త్రోసిపుచ్చడం సరియైందికాదు. 1931 సంవత్సరంలో లెనిన్‌గ్రాడ్ (రష్యా)లో జరిగిన ఒక సమావేశంలో ఆసియా సమాజాల్ని విశ్లేషించడానికి ఆసియా ఉత్పత్తి విధానం (AMP = Asiatic Mode of Production) అనే మార్క్స్ భావన ఔచిత్యాన్ని, సుసంగతత్వాన్ని తిరస్కరించడం జరిగింది. (**A Dictionary of Marxist Thought,** Edited by Bottomore, Oxford University Press, Delhi, 1987, పేజీ : 34). ఆ తీర్మాన ప్రభావమే కోశాంబి అభివర్ణించిన ఈ దేశ అధికార మార్క్సిస్టు (Official Marxists)లపై పడింది. అప్పటి నుండి కనీసం దీనిపై చర్చనే తిరస్కరించే ధోరణి కమ్యూనిస్టు పార్టీ చరిత్రకారుల్లో కనిపిస్తుంది. డాంగే నుండి ఏటుకూరు బలరామమూర్తి వరకు లెనిన్‌గ్రాడ్ తీర్మాన ప్రభావమే కనిపిస్తుంది. కోశాంబి కూడా AMP భావనతో పూర్తిగా ఏకీభవించలేదు. కంభంపాటి ఇంకొంచెం స్వతంత్రంగా ముందుకు వెళ్ళి ఈ భావనను ఆంధ్రదేశ చరిత్రకు అన్వయించి మంచి ఫలితాలు సాధించారు. ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ ఆద్యుల్లో ఒకరైన కంభంపాటి ఇంత స్వతంత్ర పరిశోధనా ధోరణిని ప్రదర్శించడం అధికార కమ్యూనిస్టుల్లోని యాంత్రిక పరిశోధనా పద్ధతులకు మారుగా సృజనాత్మక పరిశోధనా పద్ధతులకు పరివర్తనగా భావించవచ్చు. కంభంపాటి సత్యానారాయణ లాగా భవిష్యత్తు పరిశోధకులు స్వతంత్రంగా పరిశోధన చేసి భారత చరిత్రను, అందులో భాగమయిన ఆంధ్రుల చరిత్రకు సంబంధించిన మరుగునపడ్డ విషయాల్ని వెలికి తీస్తారని ఆశిస్తున్నాను. ఎంగెల్స్ ఒక సందర్భంలో అన్నట్లు ''సమస్త చరిత్రను సరికొత్తగా అధ్యయనం చేయాలి. గట్టిగా శ్రమించి పనిచేసే ఎవరయినా, ఎంతో సాధించి, పదిమందిలో రాణించవచ్చు'' (**మార్క్స్, ఎంగెల్స్‌ల సంకలిత రచనలు,** ప్రగతి ప్రచురణాలయం, మాస్కో, భాగం IV, 1982, పేజీ: 135).

(సమాప్తం)

# చిత్రకళలో ఉత్తమోత్తమ శైలులను ఔపోశన పట్టిన
## అగస్త్యుడు - మాదవ్ సత్వాల్‌కర్

- కాండ్రేగుల నాగేశ్వరరావు

భారతీయ చిత్రకారులలో ఉత్కృష్ట స్థాయికి చేరుకున్న అతిరథుడతను. ఇతని అల్లిక జిగిబిగి లేని రచనలు చూస్తుండగానే మనల్ని కట్టి పడేస్తుంది. ఇందులో అర్థంకానిదంటూ ఏమీ ఉండదు. రూపం, భావం, లాలిత్యం సమపాళ్ళలో రంగరించబడ్డ ముష్టాన్న భోజనం అనతి చిత్రాలు. ఆ చిత్రాల వెనుక కవిత్వం కనిపిస్తుంది. గానం వినిపిస్తుంది. వెన్నెలలో మలయ మారుత విలాసాలకి రెపరెపలాడే ఎండుకొబ్బరాకు చప్పుళ్లు. విలాసంగా శయనించిన ముగ్ధవనితలు, ఇంద్ర ధనస్సు రంగులతో శోభాయమానంగా ఉండే రాజస్థాన్, సౌరాష్ట్రాలలోని పురవీధులు మన దృష్టిని మరల్చ నివ్వవు. అతను భారతదేశపు ఒక టర్నర్, ఒక విన్సెంట్ వాన్‌గో ఒక పాల్‌గాగున్. ఆ ముగ్గురి ప్రభావం తనపై వున్నదని వినయంతో ఒప్పుకొనే మూర్తిమత్వం మాధవ్ సత్వాల్‌కర్. తండ్రి శ్రీపాద దామోదర సత్వాల్‌కర్. ఒక చిన్న తరహా చిత్రకారుడు. మాధవ్‌కు మూడేండ్ల వయస్సులో కుటుంబం మహారాష్ట్రలోని సతారా వద్ద వున్న చిన్న స్వతంత్ర రాజ్యం 'అవద్' చేరుకుంది. తండ్రి వేసిన నీటిరంగుల చిత్రం భీష్మాచార్య అతనికి చిత్రకళలో అభిలాష కలిగించింది.

అవద్‌లోని బాల్యం మరపురానిది. దానికి రాజు రాజాభావరావు. అతనికి కళలపై ఆశక్తి ఎక్కువ. ఆయన సేకరించిన లెఖ్ఖకు మించిన కళాఖండాలు ఈ రోజు మనం అవద్‌లోని భవానీ మ్యూజియంలో చూడవచ్చు. అక్కడ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఠాగూర్ సింగ్, ముల్లర్, దురంధర్ చిత్రాలున్నాయి. అవద్‌లోని పాఠశాలలో చిత్రలేఖనం, సంగీతం, వడ్రంగం విధిగా నేర్చుకోవలసిన పాఠ్యాంశాలు. భారత దేశంలో మరెక్కడా ఇటువంటి సూత్రం లేదు. దీని వల్ల అందరూ చిత్రకారులు, సంగీత కారులూ కాక పోవచ్చు కానీ ఉత్కృష్టమైన కళారీతులను దర్శించటం వలన జీవితం మరింత శోభిల్లే అవకాశముంది. మొదటి గురువు దియోదర్ ప్రోత్సాహంతో 12 సంవత్సరాల వయస్సులో ఇంటర్ డ్రాయింగ్ పరిక్షలకు కూర్చొని మొదటి బహుమతిగా 3 రూపాయలు గెలుచుకున్నాడు. రాజావారి మహలులో నిత్యం చిత్ర లేఖనం అప్రతిహతంగా కొనసాగుతుండేది. బర్మపా అనే చిత్రకారుడు పురాణాలకు సంభందించిన చిత్రాలు వేసేవాడు. పురమ్ అనే పేరుగల ఒక తెలుగు వ్యక్తి రాజావారి ఆస్థాన చిత్రకారుడు. అతను ఆంధ్రవీర్ అనే పత్రికను స్వతంత్రంగా నడిపేవారు. హల్దంకర్ అనే తండ్రి ప్రియ మిత్రుడు కూడా గొప్ప చిత్రకారుడు. 12 సంవత్సరాల వయస్సులో పునే వీళ్ల ముగ్గురి వద్దా చిత్రకళను నేర్చుకున్నాడు. 1932 ప్రాంతంలో అవద్‌రాజు కొందరు చిత్రకారులను తీసుకొని అజంతా వెళ్ళాడు. అజంతా చిత్రాలు కొంత కాలానికి కనుమరుగవుతాయని భావించి వాటికి నకళ్ళు చేయించాడు. మొత్తం టీము అంతా రెండు నెలలు అజంతా గుహలలో గడపి వచ్చారు. మాధవ్ కూడా కొన్ని నకళ్ళు వేశాడు. భారతీయ చిత్రకళతో గాఢాను బంధం అప్పుడు ఏర్పడింది.

1934వ సంవత్సరంలో మెట్రిక్ పరిక్ష పాసయిన వెంటనే తన అకాంక్ష రూపు దిద్దు కోవటం కోసం బొంబాయిలోని జె.జె.స్కూలు ఆఫ్ ఆర్ట్స్ చేరుకున్నాడు. రాజాగారు అక్కడి పిన్సిపల్ అయిన సోలమన్‌కు ఒక పరిచయ ఉత్తరం వ్రాశారు. దివాకర్‌ను పరీక్షించిన సోలమన్ అతనిని డైరెక్టుగా 3వ సంవత్సరంలోకి ప్రవేశపెట్టారు. కొన్ని నెలలు పోయిన తరువాత అతని ప్రతిభను గుర్తించి నాల్గవ సంవత్సరంలోకి పంపించారు. సోలమన్ ఏనాడు బోర్డు మీద గీతలు గీసేవాడు కాదు. విద్యార్థులు

కాండ్రేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో అడిషనల్ కమీషనర్‌గా పదవీ విరమణ చేశారు. కళా సాహిత్యాలు అభిమాన విషయాలు.

వేసిన చిత్రాలను చూసి, సూచనలిచ్చి, ప్రోత్సహించేవాడు. హైదరాబాద్, నాసిక్ ప్రాంతాలకు విహార యాత్రలకు తీసుకొని వచ్చినపుడే అతని ప్రతిభను ప్రత్యేకించి చూడగలిగాడు. మరొక అధ్యాపకుడయిన నగర్‌కర్ బెంగాలీ చిత్రకారుల చిత్రాలలోని సూక్ష్మాలను విశద పరచేవాడు. విఖ్యాతి గాంచిన అహివాసి కూడా అప్పుడప్పుడూ క్లాసులు తీసుకొనేవాడు.

తండ్రికి సంస్కృత భాషపై మక్కువ. వేదపఠనం నిత్యపారాయణం. కేనోపనిషత్తు ఈసావ్యాసోపనిషత్తుల లోని శ్లోకాలు వల్లె వేయించేవాడు, ఏ మాత్రం ఉచ్ఛారణ ధోషం ఉన్నా సహించేవాడు కాదు. ఆయన 101 సంవత్సరాలు జీవించాడు. ఈ కఠినమైన క్రమశిక్షణా పూరిత జీవితం తన చిత్రలేఖనం పై ప్రత్యక్ష ప్రభావం చూపిందంటాడు. బొంబాయిలో చదువు ముగ్గించుకొని విదేశాలకు వెళ్ళబోయేముందు హైదరాబాద్ వివేకవర్ధనీ కాలేజి ప్రిన్సిపాలయిన బాబాయి వద్ద కొంతకాలం ఉన్నాడు. అప్పుడు నిజాం రాజ్యాభిషేకాన్ని చిత్రించిన రామకృష్ణ దేవస్కార్ కుమారుడయిన సుకుమార్‌తో గాఢమైత్రి ఏర్పడింది. సుకుమార్ శాంతి నికేతన్‌లో చిత్రలేఖనం అభ్యసించిన తరువాత 8 సంవత్సరాలు ప్రాశ్చాత్య కళారీతులను ఆకళింపు చేసుకోవటం కోసం యూరోప్‌లో ఉన్నాడు. ఇటలీలోని ఫ్లారన్స్ నగరంలో ఉన్న చిత్రకళా అకాడమీలో పనిచేస్తున్న బెస్తియన్నీ అన్న అధ్యాపకుని వద్ద చిత్రకళను తప్పనిసరిగా నేర్చుకోవలసిందని చెప్పాడు. ఫ్లారన్స్‌లోని రాయల్ అకాడమీ సభ్యుడతను. అతను చెప్పినట్లుగానే ఆయన వద్ద తన కళకు మరింత పదును పెట్టుకున్నాడు. బెస్తియన్నీకి ఇటాలియన్ తప్ప మరొక భాష రాకపోవటం గొప్ప ప్రతిబంధకమయింది. అందుకని విధిగా ఇటాలియన్ భాషను నేర్చుకున్నాడు. ఆయన గురించి చెబుతూ ''రేఖాచిత్రాలలో అందె వేసినచెయ్యతనిది. అతను వేస్తున్నప్పుడు చూసి తీరవలసిందే మేము గీసే గీతలలోని తప్పులను అతను చెబితేనే గాని మాకు తెలిసేవి కావు. నేను వేసిన రేఖా చిత్రాలలో గ్రీకు ప్రభావమెక్కువని అవి లేని అందాన్ని ఉన్నతీకరిస్తాయని అది అంత మంచి పద్ధతి కాదని బాహ్యరేఖలు మాత్రం సత్యానికి దగ్గరగా ఉండాలని అది మిగిలిన పొరపాట్లను పూడ్చి పెడుతుందనీ చెప్పేవాడు. విద్యార్థులలోని పొరపాట్లను పూడ్చి పెడుతుందనీ చెప్పేవాడు. విద్యార్థులలోని పొరపాట్లను సున్నితంగా విమర్శించేవాడు. అంతలోనే ప్రోత్సహించేవాడు. సున్నితమైన కళాహృదయాలను మానసికంగా గాయ పరచకూడదని అతని భావన. అంత గొప్ప మనస్సు గల అధ్యాపకుని తానెక్కడా చూడలేదని అంటాడు సత్వాల్‌కర్.

ఇటలీలోని ఫ్లారన్స్ అనికి నచ్చిన ఊరు. ఫ్లారన్స్‌లో వున్న ఆర్ట్‌గ్యాలరీలు మిగిలిన చోట్ల కనిపించవు. కొన్ని వందల సంవత్సరాల కళా సంపదను వారు జాగ్రత్త పరిచారు. మ్యూజియం ప్రవేశ రుసుం ఎక్కువ ఉంటుంది. చిత్రకళా విద్యార్థులకు మాత్రం ప్రవేశం ఉచితం. విద్యార్థులు కొన్ని అపురూప చిత్రాలకు నకళ్ళు తయారు చేసుకోవచ్చు. వాటికి కావలసిన డ్రాయింగ్ బోర్డులాంటి వసతులన్నీ అక్కడే లభ్యమవుతాయి. యూరోప్‌లోని అనేక చిత్రశాలల్లో మ్యూజియంలలో ఇదేపద్ధతి అవలంభిస్తారు. యూరప్‌లో చదువు ముగించుకొని ఇంగ్లండు చేరుకున్నాడు. ప్రకృతి చిత్రణ ఇంగ్లాండు, ఫ్రాన్స్ దేశాలలో ఎక్కువగా ఉండేవి. ఇంగ్లండు వచ్చేంతవరకు ఇంప్రెషనిజంకు చెందిన చిత్రాలేమీ చూడలేదు. టర్నర్ చిత్రాలను చూడటం, ప్రభావితం గావటం అప్పుడే జరిగింది. అక్కడ ప్రొఫెసర్ స్వాబ్ వద్ద రేఖా చిత్రాలలో కొత్త కోణాన్ని దర్శించాడు. క్లాసుకు రాగానే అతను ఒక చాకు తీసుకొని పెన్సిల్‌ను సన్నటి ముల్లు వచ్చేలా చెక్కేవాడు. రేఖలు చాలా తక్కువ వేయాలని, వీలయినంతమటుకే షేడ్ చూపాలనేది అతని సారాంశం. ఆ సమయంలోనే ప్రఖ్యాత అవ్యక్త చిత్రకారుడు హెన్రీమూర్‌తో పరిచయం కలిగింది. అతను అవ్యక్త చిత్రాలు వేసినా విద్యార్థులకు మాత్రం వాస్తవ చిత్రీకరణం చేయమనేవాడు. వాస్తవ చిత్రీకరణలో ప్రావీణ్యత సంపాదించనిదే మరొక శైలికి వెళ్ళ వద్దని ప్రత్యేకశైలి

దానంతటదే ఏర్పడుతుందనే మూర్ అభిప్రాయంతో పూర్తి ఏకీభావం ఉందతనికి. ఇంగ్లండులో శిక్షణ పూర్తయిన తరువాత జర్మనీలోని మ్యూనిక్ నగరం చేరుకున్నాడు. అక్కడ వేయిమార్ అన్న స్కూలులో విద్యార్థులుతో తప్పనిసరిగా ప్రాణాయామం, ధ్యానం చేయించటం తనికి ఆశ్చర్యం కలిగించిందంటాడు. జర్మనీలో కల్మన్ అనే అధ్యాపకుని నాజీ ఆధిక్యత దృక్పథంతో సరిపెట్టుకో లేక 1940లో భారత దేశం తిరిగి వచ్చాడు.

విదేశాల నుండి చదువు ముగించుకొని వచ్చిన తరువాత ఒకరి క్రింద ఉద్యోగం చేయడానికి మనస్కరించ లేదు. ఉద్యోగం చేయడానికి అవసరం లేని ఆర్థిక వనరులు ఉన్న వ్యక్తిగా చాలామంది అపోహపడ్డారు. ఈ సంకట పరిస్థితి నుంచి ఎలా బయట పడాలో తెలియని పరిస్థితుల్లో పాల్సన్ కాఫీ వాళ్ళు ప్రకటనలపై చిత్రాలు వేశాడు. కాల్‌టక్స్ కంపెనీకి నాలుగు రుతువులుతో కూడినకాలండర్‌ను వేసిపెట్టాడు. దాని వల్ల అతను ప్రజల దృష్టిలోకి వెళ్ళాడు. శంకర్ కిర్లోస్కర్ అనే పారిశ్రామిక వేత్త అతనికి అభిమానిగా మారాడు. అతని వద్ద నుంచి కొన్ని చిత్రాలు కొని వానిని తాను నడుపుతున్న కిర్లోస్కర్ అనే మాసపత్రికకు ముఖచిత్రాలుగా వేశేవాడు.

బొంబాయిలో వున్న బలభాయ్ ఇన్స్టిట్యూట్‌లో గడిపిన రోజులు (1945 నుండి 1960 వరకు) మరుపురానివని, అవి భారతదేశపు కళాచరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింప దగ్గవని అతని భావన. ఆ రోజులు గురించి చెబుతూ, ''ఆ ఇనిస్టిట్యూట్‌లో నాతో బాటుగా ఎస్.ఎఫ్. హుస్సేన్, హరికిషన్, ప్రభ, విఠల్‌లాంటి చిత్రకారులు పనిచేసేవారు. అందరి స్టూడియోలు అందులోనే ఉండేవి. మరొక పక్క పండిట్ రవిశంకర్ తన విద్యార్థులకు సంగీత శిక్షణ ఇచ్చేవాడు. ఇంకొక పక్క వైజయంతీమాల, సబవ్‌శంకరులు నృత్యాన్ని భోదించేవారు. సత్యదేవ్ దూబే, విజయ మెహతా లాంటివారు నాటనకు రిహార్సలు జరిపేవారు. ఆరోజులు (సుమారు 15 సంవత్సరాలు) ఎప్పటికీ తిరిగిరావు. అది ఒకగొప్ప ఘట్టం'' అంటాడు.

మొదట్లో నీటిరంగులలో చిత్రాలు వేశేవాడు. కానీ నీటిరంగులు త్వరలోనే తమ రంగును కోల్పోవటం, నీటితో తడిపిన కాగితం కొంతకాలానికి వాతావరణ ప్రభావానికి లోనై పెలుసుగా మారటం, అన్నిటినీ మించి నీటి రంగులలో వేసే చిత్రాలు పరిమాణంలో తక్కువ కావటం వల్ల వాటిని వదిలి నూనె రంగుల చిత్రాల వైపు దృష్టి మరల్చాడు. అతని చిత్రాలలోని వ్యక్తులు విచార వదనంతో కనిపించరు, ఉల్లాసంగా ఉంటారు. బాధను తాత్విక తత్వంతో జయించే శక్తి భారతీయుల కుంది. అందువలననే అలా చిత్రించానంటాడు.

18 సంవత్సరాల వరకూ ఆవద్, సౌరాష్ట్ర, రాజస్థాన్‌లతో నెలకొన్న ఆత్మీయ బంధం జీవితాంతం ఆయన మదిలో ఉండిపోయింది. ఆ తరువాత బొంబాయిలో గడిపిన ఆధునిక జీవనశైలులు అతనినే మాత్రం ప్రభావితం చేయలేకపోయాయి. నిరంతర పుస్తక పఠనం ప్రతి కళాకారునికి తప్పక ఉపయోగ పడుతుంది. దాని వల్ల కొత్త ఆలోచనలు మెలకెత్తి, భావాలు నిస్కృత మవుతాయని, మానవుని అచేతన వ్యవస్థపై కూడా పుస్తక పఠనం తన ప్రభావాన్ని చూపుతుందని ప్రగాఢంగా నమ్ముతాడు. తన చిత్రాలపై 'మాధవ్' అనే మరాఠీ అక్షరాలతో సంతకం చేస్తాడు.

60 సంవత్సరాలపైబడ్డ (ఇప్పుడు ఆయన వయస్సు 89 సంవత్సరాలు) కళాజీవితం, సంతోషాన్ని, తృప్తిని ఇచ్చినా మనసులోని మారుమూలల్లో ఇంకా చేయవలసినది చాలా ఉందనే భావన మిగిలి పోయింది. ఇంగ్లీషు రచయిత రస్కిన్ మాటలు "Paint what you like and like what you paint", ఏది చిత్రిస్తావో దానిని ప్రేమించు, దేనిని ప్రేమిస్తావో దాన్ని చిత్రించు, అన్నది అతని మాటకూడా.

# కొలంబియమ్ పట్ల కుతూహలం

-డా॥ చాగంటి కృష్ణకుమారి

'కొలంబియమ్' పేరును ఎప్పుడైనా విన్నారా? ఈ పేరు ఎలా ధ్వనిస్తోందంటారూ? క్రోమియమ్, కాల్షియమ్, కాడ్మియమ్ ఇలా చాలా లోహ మూలకాల పేర్లు విని ఉంటారు. అందువల్ల 'కొలంబియమ్' కూడా కచ్చితంగా ఒక రసాయన మూలకం ; ఒక లోహం అయి ఉండవచ్చు అంటారా? సందేహం తీర్చుకోవాలంటే ఏం చేయాలి? ఉందిగా! ఆధునిక రసాయన మూలకాల ఆవర్తన పట్టిక - అందులో మూలకాల పేర్లు, వాటి సంకేతాలు, పరమాణు భారాలు, పరమాణు వ్యాసార్ధాలు ఇత్యాది వివరాలన్నీ దొరుకుతాయి కదా! పదండి చూద్దాం. ఆవర్తన పట్టికలో ఈ చివర నుంచి ఆ చివరి దాకా ఉన్న మూలకాలన్నింటినీ పేరు పేరునా చదివినా ఎక్కడా 'కొలంబియమ్' మూలకం తగల లేదా! IUPAC (International Union of Pure and Applied Chemistry) వారి ఆమోద ముద్ర పొందిన వివరాలతో తయారైన అత్యాధునిక రసాయన మూలకాల ఆవర్తన పట్టికలో 'కొలంబియమ్' లేదు. అంతేకాదు; యూరప్‌లో అచ్చు అయిన లోహాల, లోహ సమ్మేళనాల జాబితాలలో కూడా ఎక్కడా 'కొలంబియమ్' కనిపించదు.

అయినప్పటికీ 'కొలంబియమ్' ఒక లోహ మూలకం కావొచ్చునన్న మీ మొట్టమొదటి ఊహ సరియైనదే సుమండీ. నిజమే! అది ఒక లోహమే! దాని సంకేతం Cb. మరి అటువంటప్పుడు అది ఆవర్తన పట్టికలో ఎందుకు కనిపించలేదు? ఏమిటో వింత? అందుకే మరి - సరదాగా సైన్సు లోకంలో విహరిస్తూ ఉంటే 'కొలంబియమ్' తగిలింది. అది ఆవర్తన పట్టికలో కనిపించకపోయే సరికి దానిపట్ల కుతూహలం కలిగింది.

USA లో లోహాల మీద ప్రచురించబడుతున్న పత్రిక లన్నింటిలోనూ 'కొలంబియమ్'కి కొలంబియమ్ మిశ్రలోహాలకి సంబంధించిన ప్రకటనలు కనిపిస్తాయి. దాని సంకేతం Cb గా కూడా ఆ పత్రికలలో గుర్తించగలుగుతాము. ప్రత్యేకించి అమెరికావారి లోహమే అయిన ఈ కొలంబియమ్‌తో సరిసమానమైన ధర్మాలు ఉన్న మరొక లోహం ఆవర్తన పట్టికలో కనిపిస్తుంది. దాని పేరు నియోబియమ్. సంకేతం Nb. కొలంబియమ్, నియోబియమ్‌లు రెండూ ఒక లోహానికే పెట్టిన రెండు పేర్లా? ఎవరిష్టం వచ్చినట్లు వారు పేర్లు పెట్టుకొంటూ పోతే శాస్త్రం అంతా గందరగోళంగా తయారవుతుంది. అందుకే ప్రపంచం అంతా ఒక లోహాన్ని ఒక పేరుతోనే పిలవాలి. కొలంబియమ్, నియోబియమ్‌లు ఒకటే అయినప్పుడు అమెరికావారు నియోబియమ్‌ని కొలంబియమ్ అని ఎందుకు పిలవాలి? IUPAC వారి మాటను కూడా లెక్క చేయకుండా? ఎందుకో తెలుసుకోవడానికే కొలంబియమ్ గురించిన ఈ కథనం.

'కొలంబియమ్' పేరుతో పరిచయం లేనట్లుగానే ఈ లోహాన్ని కనుగొన్న చార్లెస్ హాషెట్ (Charles Hatchett) పేరుని కూడా ఈనాటి చాలా మంది రసాయన విశ్లేషకులు విని ఉండకపోవచ్చు. రసాయన శాస్త్రం చదువుకొన్న వారందరూ రసాయన ప్రయోగశాలలో ఉల్ఫ్స్ సీసా (Wolfe's bottle) ని వాడి ఉంటారు. లేదా కనీసం చూసి ఉంటారు. Woulfe's bottle ని రూపొందించిన వాడు పీటర్ ఉల్ఫ్ (Peter Woulfe) చార్లెస్ హాషెట్ పీటర్ ఉల్ఫ్‌కి ప్రక్కింటాయన; మంచి స్నేహితుడు కూడా.

---

డా॥ చాగంటి కృష్ణకుమారి, రీడర్ మరియు హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, సింగరేణి కాలరీస్ ఉమెన్స్ డిగ్రీ కాలేజి, కొత్తగూడెం - 507 101

Charles Hatchett లండన్‌లో 2-1-1765 న సంపన్న కుటుంబంలో పుట్టాడు. 10-3-1847న లండన్‌లోనే చనిపోయాడు. అతని తండ్రికి లండన్‌లో బగ్గీ బండ్ల తయారీ పరిశ్రమ ఉండేది. రాచ కుటుంబానికి అతను బగ్గీలను సరఫరా చేసేవాడు. సుసంపన్నుడు. అందువల్ల Hatchett అల్లారు ముద్దుగా పెరిగాడు. అతని చదువు సంధ్యల గురించి, విద్యార్హతల గురించి మనకు ఏ సమాచారం అందుబాటులో లేదు. రసాయన శాస్త్రంలో నిష్ణాతుడెలా అవగలిగాడో తెలియదు. తన కొడుకు తను నడుపుతున్న బగ్గీ పరిశ్రమనే చేపట్టాలనీ, ఆ వ్యాపారంలోనే తర్ఫీదు పొందాలనీ Hatchett తండ్రి ఆశించాడు. కానీ Hetchatt విజ్ఞాన.శాస్త్రాలపట్ల, ముఖ్యంగా రసాయన విశ్లేషణ పట్ల ఎక్కువ ఆసక్తి కనపరిచాడు. కొడుకు వ్యాపారం పట్ల సుముఖత చూపెట్టక పోయేసరికి తండ్రి చాలా నిరాశ చెందాడు. రసాయన విశ్లేషణా వ్యాపకాన్ని వదిలిపెట్టినట్లయితే 3000 పౌండ్స్ ఇస్తాననీ, పార్లమెంట్‌లో సీటు ఇప్పిస్తాననీ కొడుకుకి 'ఎర' చూపించాడు. ఆ రోజులలో ఆ పైకం చాలా ఎక్కువ మొత్తం కిందకే లెక్కకి వస్తుంది. పార్లమెంట్‌లో సీటు కూడా ఏమీ తక్కువైన పదవికాదు. Hatchett వాటికి లొంగలేదు. రసాయన విశ్లేషణను వదిలి వ్యాపారాన్ని ససేమిరా చేపట్టనన్నాడు. అతని తండ్రి మంచి మనసుతో, ఉదార బుద్ధితో Hatchett ని అతని ఇష్టానికి అతనిని వదిలిపెట్టేసాడు. వ్యాపారం చేసి తీరాలంటూ బలవంతం పెట్టలేదు.

1786 లో Charles Hatchett, Elizabeth Collick ని పెళ్లి చేసుకొన్నాడు. 1800లో లండన్‌లో Chiswick దగ్గర ఒక చిన్న రసాయనాల తయారీ పరిశ్రమని చేపట్టాడు. William Thomas Brande ని చేరదీసి రసాయన శాస్త్రాన్ని, ఖనిజ శాస్త్రాన్నీ బోధించాడు. తన రసాయనాల తయారీ పరిశ్రమలో ఉద్యోగిగా నియమించాడు. 1818లో Hetchett రెండవ కూతుర్ని William Brande పెళ్లి చేసుకొన్నాడు. 1796 నుండి 1806 దాకా Hatchett వైజ్ఞానిక రంగంలో చాలా గణనీయమైన కృషి చేసాడు. 1797లో Fellow of Royal Society గా ఎంపికయ్యాడు. ఆ కాలంలో వైజ్ఞానికునిగా అతనికున్న గౌరవ ప్రతిపత్తులకి ఇది ఒక నిదర్శనం. ఆ రోజులలో రసాయన విశ్లేషణలో మంచి నైపుణ్యం గలవాడిగా ఖ్యాతి గడించాడు.

Hatchett 1801లో ప్రచురించిన ఒక వ్యాసంలో 'కొలంబైట్' రసాయన విశ్లేషణా వివరాలను ఇస్తూ, ఉత్తర అమెరికాలో కొలంబియా దగ్గర దొరికిన ఖనిజం కావడం చేత తను దానికి 'కొలంబైట్' అని పేరు పెట్టాననీ, అందులో ఒక సరికొత్త లోహ మూలకం ఉందనీ ప్రకటించాడు. లోహానికి 'కొలంబియమ్' అని పేరు పెట్టాడు. Massachusetts లో దొరికిన ఇదే ఖనిజ శాంపిల్ ఒక దానిని 1753 నుండి బ్రిటిష్ మ్యూజియమ్‌లో ప్రదర్శిస్తున్నారు. దీనిని Hatchett ''బంగారు వన్నె గీతలు గల బరువైన రాయి....'' అంటూ అభివర్ణించాడు.

కొలంబియమ్ పరమాణు సంఖ్య 41 అయితే 73 పరమాణు సంఖ్యగల లోహం టాంటలమ్. దీని సంకేతం Ta. ఈ రెంటికీ బాగా దగ్గర పోలికలున్నాయి. స్వీడిష్ రసాయన శాస్త్రజ్ఞుడైన Andres Gustaf Ekebery 1802లో The Hootantalite ఖనిజంలో టాంటలమ్‌ని కనుగొన్నాడు. దీని ఆక్సైడ్ సాధారణ ఉష్ణోగతల దగ్గర హైడ్రోఫ్లోరిక్ ఆమ్లంలో తప్పించి. ఇక ఏ ఇతర ఆమ్లాలలోనూ కరగదు. ఆమ్లాలలో కరగకుండా అల్లరి పెడుతూ Ekeberg ని బాగా ఏడిపించింది కనుక, అతను దానికి టాంటలమ్ (Tantalum) అని పేరు పెట్టాడు. Tantalizing అంటే teasing అనే అర్థంగల ఇంగ్లీషు పదం నుండే Tantalum అనే పదాన్ని తను కనుగొన్న కొత్త లోహానికి పేరుగా ఎంపిక చేసాడు. అంతేకాక, గ్రీకు పురాణంలో Siphylos కి రాజు అయిన Tantalus దుష్ట కార్యాలు చేస్తూ పాపి

కావడంవల్ల దేవతలు అతనికి ఒక ప్రత్యేకమైన శిక్షవేసారు. Tantalus నీటిలో తన చుబుకం దాకా నీరు వచ్చేదాకా మునిగి నుంచుని ఉండాలి. నీరు తాగడానికి అతను మొఖాన్ని వంచిన ప్రతీసారీ నీటి మట్టం కిందకి దిగిపోతూ ఉంటుంది. Ekeberg Tantalum గురించి మాట్లాడుతూ "ఈ లోహాన్ని ఆమ్లాలలో ముంచి తీసినప్పుడు ఆమ్లాన్ని పీల్చుకోలేని దాని అసమర్థతని Tantelus నీటిలో మునిగి ఉండీ దాహం వేసినప్పుడు నీరు తాగలేని అతని అసమర్థతతో పోలుస్తూ, దానికి నేను Tantalum అని పేరు పెట్టాను" - అన్నాడు. లోహాలకి పేర్లు పెట్టేటప్పుడు గ్రీకు పురాణగాథల నుండీ పేర్లను గ్రహించడం ఆ రోజులలో రసాయన విశ్లేషకులకు ఆనవాయితీ.

కొలంబియమ్, టాంటలమ్‌లు రెండూ ప్రకృతిలో ఎప్పుడూ కలిసే ఉంటూ ఉంటాయి. దీనికి కారణం వాటి పరమాణు సైజులు ఒకటి కావడమే! టాంటలమ్ ఖనిజాలలో కొలంబియమ్, కొలంబియమ్ ఖనిజాలలో టాంటలమ్ తప్పనిసరిగా ఉంటాయి. కాకపోతే వాటి నిష్పత్తులలో తేడా ఉంటుంది. కొలంబైట్ ఖనిజంలో కొలంబియమ్ ఎక్కువగా టాంటల్ తక్కువగా ఉంటే, టాంట లైట్ ఖనిజంలో టాంటలమ్ ఎక్కువగా, కొలంబియమ్ తక్కువగా ఉంటాయి.

1809లో William Wollaston కొలంబైట్‌నీ, టాంటలైట్‌నీ విశ్లేషించి చూసాడు. టాంటలమ్, కొలంబియమ్‌ల మధ్య బాగా దగ్గర పోలికలు ఉండటంచేత వాటిని వేరువేరుగా గుర్తించలేని అయోమయావస్థలో పడి చివరికి ఆ రెండూ ఒకటేనని భావిస్తూ. Hatchett గారి కొలంబియమ్, Ekebarg గారి టాంటలమ్‌లు రెండు వేరువేరు లోహాలుకావు, అవి రెండూ ఒకటే! అంటూ ప్రకటించాడు. Wollaston బాగా పరపతి గల వ్యక్తి. అందువల్ల అతని మాటే నెగ్గింది. కొలంబియమ్‌నీ, దానిని కనుగొన్న Hatchett నీ అందరూ తిరస్కరించారు. తండ్రి చనిపోవడం వల్ల Hatchett తన రసాయన విశ్లేషణా వ్యాపకాన్ని వదిలి తండ్రి బగ్గీ వ్యాపారాన్ని చేపట్టవలసి వచ్చింది. వ్యాపారంలో తలమునకలవుతూ తను కనుగొన్న కొలంబియమ్ విషయంలో ఉదాసీనంగా ఉండిపోయాడు. Wollaston ని ఎదిరించి తన విశ్లేషణా ఫలితాల నిజాయితీని నిరూపించుకోలేదు. అందువల్ల Ekeberg గారి పేరు ఇటు టాంటలమ్‌తోనూ, అటు కొలంబియమ్ తోనూ కూడా ముడిపెట్టి వినిపిస్తూ ఉండేదట. టాంటలమ్, కొలంబియమ్‌ల విషయంలో ఈ అయోమయ పరిస్థితి ఇంచుమించు Hatchett చనిపోయే ముందు రెండు- మూడు సంవత్సరాల దాకా కూడా - అంటే - 1844లో Heinrich Rose తిరిగి కొలంబియమ్‌ని కనుగొనేదాకా కొనసాగింది. కానీ ఈసారి Heinrich Rose మూలకం 41ని కొలంబియమ్ అనకుండా నియోబియమ్ అన్నాడు. ఈ పేరు గ్రీకు పురాణంలోని అప్సరస నియోబి (Niobe) నుండి గ్రహించాడు. నియోబి టాంటలస్ కూతురు. ఈమె Amphion రాజు భార్య. ఆరుగురు కొడుకులనీ, ఆరుగురు కూతుర్లనీ కన్నది. ఇద్దరే సంతానం గల Titaness Leto దగ్గర తన ఆధిక్యతను ప్రదర్శిస్తూ గర్విష్టిగా వ్యవహరించేది. పురాణ గాథలలో గర్వభంగ ఘట్టాలు మామూలే. నియోబి గర్వాన్ని అణచడానికి దేవతలు ఆమె సంతానాన్ని సంహరించారు. ఆమెని ఓదార్చడం ఎవరి వశమూ కాలేదు. చివరికి భరింపరాని కడుపుశోకంతో Mt Siphylm దగ్గర రాయిగా మారిపోయింది. ఈ రాయి మీద ఎప్పుడూ మంచు కరుగుతూ ఉంటుంది. కనక నీళ్ల కారుతూ ఉంటాయి. ఆ విధంగా నియోబి నిరంతరం కన్నీళ్లు కారుస్తూ ఉండిపోయింది. తండ్రి కూతుర్లయిన Tantalum, Niobe లకు దగ్గర పోలికలు ఉన్నట్టుగానే Tantalum, Niobium లకు కూడా భౌతిక రసాయన ధర్మాలలో బాగా దగ్గర పోలికలున్నాయి కనక Rose తను కనుగొన్న లోహానికి నియోబియమ్ అని పేరు పెడుతున్నానన్నాడు. నిజానికి Hatchett

కొలంబియమ్ ఆక్సైడ్‌నీ, టాంటలమ్ ఆక్సైడ్‌నీ విశ్లేషించి వాటి ధర్మాలలో గల తేడాలను గుర్తించి వాటిని రెండు వేరువేరు లోహాలుగా ఎప్పుడో వివరించగలిగాడు. కానీ Wollastow గారి ఆధిక్యత పరిస్థితులవల్ల Hatchett పరిశోధనా ఫలితాలు మరుగున పడిపోయాయి. Rose పరిశోధనా ఫలితాలు కూడా Neobium, tantalum ల రసాయన ప్రవృత్తులను సునిశితంగా వివరించలేక పోయాయి.

1866లో స్వీడన్‌కి చెందిన Blom Strand, స్విస్ రసాయన శాస్త్రజ్ఞుడు Marignac లు ఈ రెండు లోహాల రసాయన శాస్త్రాలని క్షుణంగా అధ్యయనం చేశారు. నియోబియమ్ (V) క్లోరైడ్ క్షయకరణం వల్ల Blom Strand నియోబియమ్‌ని వేరు చేసాడు. Roscoe నియోబియమ్ (III) క్లోరైడ్‌కి క్షయకరణం చెందించి అతని కంటే ఎక్కువ నియోబియమ్ లోహ దిగుబడిని సాధించాడు. 1970లో పరిశుద్ధమైన నియోబియమ్, టాంటలమ్‌లను వాటి వాటి ఖనిజాల నుండి W. Ven Bolton సోడియమ్ లోహంలో క్షయికరణం చెందించి వేరు పరచగలిగాడు. ఈ విధంగా నియోబియమ్‌ని (కొలంబియమ్) కనుగొన్న వంద సంవత్సరాలకి ఆ లోహాన్ని ఖనిజాల నుండి పరిశుద్ధ స్థితిలో వేరు పరచగలిగారు.

41వ మూలకాన్ని నియోబియమ్ అనాలా, లేక కొలంబియమ్ అనాలా అన్న సందిగ్ధ స్థితి కొంత వరకూ ఈనాటికీ ఉందనే చెప్పాలి. 1950లో IUPAC వారు ఈ లోహానికి Niobium పేరును ఖాయం చేసి దాని సంకేతాన్ని Nb గా పేర్కొన్నారు.

యూరప్‌లోనూ గ్రేట్ బ్రిటన్‌లోనూ ఖనిజ Hatchett ఖనిజ విశ్లేషకునిగా మంచి పేరు సంపాదించడమే కాకుండా, షెల్ (Shell), ఎముక (bone) డెంటల్ఎనామిల్ (dental enamel) వంటి వాటి విశ్లేషణలో కూడా తన చాతుర్యాన్ని ప్రదర్శించాడు. సహజ ద్రవ్యాలు (natural products) లో కూడా అతను విశేషమైన కృషి చేసాడు. తండ్రి చనిపోయాక వ్యాపారాన్ని చేపట్టి రసాయన విశ్లేషణను వదిలి పెట్టడం వల్ల, రసాయన శాస్త్రానికి తీరని నష్టం వాటిల్లిందనే చెప్పాలి. వ్యాపారము, ధన సముపార్జనలో పడిపోయిన Hat chett కి Wollaston తన కొలంబియమ్ పరిశోధనలపై చేసిన విమర్శను ఖండించి కొలంబియమ్ ఒక కొత్త లోహమనీ, అది టాంటిలమ్ కంటే భిన్నమైనదనీ నిరూపించు కోవడానికి తీరిక, సమయం దొరకలేదు. అంతేకాక అతను రసాయన విశ్లేషణాసక్తిని వదిలిపెట్టి కొలంబియమ్ పట్ల నిర్లిప్తంగా ఉండిపోయాడు. టాంటిలమ్ ఆక్సైడ్, కొలంబియమ్ ఆక్సైడ్‌ల మధ్యగల తేడాలను తన విశ్లేషణా ఫలితాల సహాయంతో మరోసారి వివరిస్తూ Wollostan ని ఎదుర్కొన్నట్లయితే, తన వాదనను సమర్థించు కొన్నట్లయితే, ఈ నాడు మనం అంతా మూలకం 41 ని నియోబియమ్ అనేవారం కాదు. కొలంబియమ్ అనే అనేవారం. ఆవర్తన పట్టికలో 41 వ గడిలో మనకి Cb కనిపించి ఉండేది.

ఇప్పటికీ ఉత్తర అమెరికా వారు ఈ లోహాన్ని కొలంబియమ్ అనే అంటున్నారు. Hatchett బ్రిటిష్ వాడయినా, అతను పెట్టిన పేరునే వాడుతున్నారు. బహుశా దానికి కారణం ఆ పేరుకి మూలం ఉత్తర అమెరికాలోని ఒక ప్రాంతపు పేరు కావడమే కావొచ్చు. IUPAC ఆజ్ఞను ప్రపంచం అంతా శిరసావహించినా అమెరికా వారు దానిని ఖాతరు చేయకపోవడానికి కారణం వారు అమెరికావారు కావడమే అని మనం చెప్పుకోవచ్చు. నియోబియమ్ - జిర్కోనియమ్ తీగెలను సూపర్ కండక్టింగ్ మాగ్నెట్‌లలో ఉపయోగిస్తారు. ఈ మాగ్నెట్‌లను బాడీస్కానర్ (body scanner) లలోనూ NMR మిషిన్‌లలోనూ వాడుతారు. ఈ లోహం ప్రముఖంగా స్టెన్‌లెస్ స్టీల్‌లో ఫెర్రోనియోబియమ్‌గా ఉపయోగపడుతోంది.

# సమసమాజంలో మానవాత్మ

మూలం : ఆస్కార్ వైల్డ్ అనువాదం : సర్దేశాయి తిరుమల రావు

(గత సంచిక తరువాయి)

ప్రజలకి నవ్యత ఎందుకిష్టం లేదంటే అదంటే భయం కాబట్టి. నవ్యత వ్యక్తిత్వానికి ప్రతినిధి. కళాకారుడు ఎన్నికచేసే ఇతివృత్తంలోనూ, దానిని మలచే విధానంలోనూ, తన హక్కును స్థాపించుకొనే ప్రయత్నం చేస్తాడు. ప్రజల వైఖరి సవ్యమయిందే మరి. కళ, వ్యక్తిత్వం. వ్యక్తిత్వం కలత పెట్టే, చీలదీసే శక్తి. ఇందులోనే దాని విలువవుండేది. నమూనాల, నమూనాల వైవిధ్యరాహిత్యాన్ని, సంప్రదాయ కవితలోని బానిసతనాన్నీ, అలవాటులోని పీడనీ, మనిషి యంత్ర స్థాయిలోకి దిగజారిపోవడాన్నీ, అదికలియ బెట్టుతుంది. ఏ కళ మిగిలిపోతుందో, దానిని ప్రజలు ఉండనిస్తారు. దానిపైని మెచ్చుకోలు వలన కాదు. దానిని మార్చలేరు కాబట్టి. ఆభిజాత్య (శ్రేణిక) కళలని మ్రింగి వేస్తారు. రుచి చూడరు. ఆ కళలని చెడిపి వేయలేని కారణాన వాటిని భరిస్తారు. వాటిపై గ్రుక్క త్రిప్పుకొనకుండా మాట్లాడుతారు. ప్రతి యొక్కరు తమ స్వంత భావాన్ని బట్టి ఆభిజాత్య రచనలని ఒప్పుకోవడం వల్ల ఎంతో చెడుగు అయింది. విచిత్రమూ అనిపించవచ్చు, విచిత్రం అనిపించకా పోవచ్చు. ఇంగ్లాండులో బైబిలునూ, షేక్సుపియరు రచనలనూ అవిమర్శాత్మకంగా మెచ్చుకోవడాన్ని ఉద్దేశించి ఇట్లంటున్నాను. బైబిలు విషయంలో మత ప్రమేయం ఉండడంబట్టి దానిని గురించి ప్రస్తావించను.

షేక్సుపియరు విషయం తీసుకొంటే, జనసామాన్యం ఆయన నాటకాలలోని సౌందర్యాన్నిగాని, లోపాలనిగానీ చూడలేక పోతున్నారు. సౌందర్యాలని గమనించితే నాటకాభివృద్ధికి అభ్యంతరం చెప్పరు. లోపాలని గమనించినా, నాటకాభివృద్ధి అభ్యంతరం చెప్పియుండరు. నిజానికి కళాభివృద్ధిని అరికట్టేందుకే ప్రజలు ఆభిజాత్య రచనలు ప్రయోగిస్తున్నారు. ఆభిజాత్య రచనలను ప్రమాణ రచనలుగా దిగజారుస్తున్నారు. సౌందర్యాన్ని నవ్యంగా వెలిబుచ్చడాన్ని ఆపేందుకు దుడ్డుకర్రలుగా ఉపయోగిస్తున్నారు. ఫలానా ఆయన వలె ఎందుకు వ్రాయవని రచయితనూ, ఫలానా ఆయన మాదిరి ఎందుకు గీయవు అని చిత్రకారునీ అడుగుతుంటారు. అలాగున చేస్తే కళాకారులు కారనే విషయాన్ని మరచిపోతారు. ప్రజానీకానికి సౌందర్యంలో నవీన ఫణితి అంటే సదభిరుచి లేదు. అందుకే నవ్యరీతుల్లో సౌందర్య మావిర్భవించినపుడు వాళ్ళు కోపపడి, తికమకపడి రెండు దద్దమ్మ పదాలని వాడుతారు. ఒకటి ఆ కళాఖండం ఏమీ అర్థంకాదు అనీ, రెండు ఆ కళాఖండం చాలా నీతి విహీనమైందనీ, వాళ్ళుద్దేశించే అర్థం ఇదీ అనుకొంటాను. ఒక రచన ఏమీ అర్థం కాదంటే వారి ఉద్దేశంలో కళాకారుడు క్రొంగొత్తగా ఉండే సుందర వస్తువును చేసినాడూ అని. చాలా నీతివిహీనమయిందంటే కళాకారుడు సత్యంగా ఉండే సుందర వస్తువును చేసినాడు అని అర్థం: మొదటిది శైలీ సంబంధి. రెండవది ఇతి వృత్త సంబంధి. ఉదాహరణకు బ్రిటిష్ ప్రజానీకం చేత యథా విధిగా అవినీతి పట్టాను పొందని నిజమైన ఏ రచయితా ఈ శతాబ్దంలో లేడు. ఈ పట్టాలు ఫ్రాన్సులోని సాహిత్యపరిషత్తు చేతగుర్తింపుతో

---

కీ॥ శే॥ డా॥ సర్దేశాయి తిరుమలరావు, (1928 - 1994) ప్రముఖ సాహిత్య విమర్శకులు

సమానం కావడం మూలాన అదృష్టవశాత్తు అటువంటి పరిషత్తు స్థాపన ఇంగ్లాండులో అనవసరమైంది. వర్డ్స్‌వర్తును అవినీతి కవి అంటారని మనం ముందుగనే ఊహించుకొనవచ్చును. కాని చార్లెస్ కింగ్స్‌లేను అవినీతి కర నవలాకారుడనడమే అసాధారణమైన విషయం. అతడతడే కావున కళాకారుడు ఇట్టివానివల్ల కలత చెందడు. నిజమైన కళా కారున కాత్మ విశ్వాసం ఉంటుంది. ఇంగ్లాండులో కళాకారుడు కళాఖండాన్ని సృష్టించిన వెంటనే ప్రజానీకం తమ పత్రికద్వారా అర్థవంతమైందనీ నీతివంతమైందనీ దానికి గుర్తింపు ఇచ్చిందో, అప్పుడు కళాకారుడు ఆసృజనలో తాను ఆత్మ ప్రత్యయం కలవాడుగా నుండెనా, తన రచన తనకు గౌరవదాయకమా? అది రెండవ రకపు రచన అయివుండకూడదా? లేక కళా లక్షణాలు ఏవీ కలిగివుండకూడదు కదా? అని ప్రశ్నించుకొనమొదలిడతాడు అని నేనుకొంటాను.

''అవినీతికరం'', ''నిరర్థకం'', ''దిగుమతి సరుకు'' అనే మాటలే ఉపయోగిస్తుందని చెప్పి ప్రజానీకానికి అన్యాయం చేసినాను. కళా విషయంలో వారు ప్రయోగించే ఇంకొక పదం కూడావుంది. అది ''కుళ్లు''. దీనిని ఎక్కువగా వాడరు. ఈ పదం యొక్క అర్థం సులభంగా ఉండడంవల్ల దానిని వాడడానికి భయపడతారు. కానీ అప్పుడప్పుడు ఉపయోగిస్తూ వుంటారు. పత్రికలలో తరచు కనబడుతుంది. కళాఖండానికీ పదప్రయోగం అసంగతం. కుళ్లు అంటే వెలిబుచ్చేందుకు సాధ్యంకాని ఒక ఆవేశం, ఒక భావసరణికాక మరేమి? ప్రజానీకమంతా కుళ్ళు. ఎందుకంటే ప్రజానీకానికి దేన్ని వెలిబుచ్చడానికీ రాదు. కళాకారుడెప్పుడూ కుళ్ళు మనస్సు వాడు కాడు. ప్రతి విషయాన్నీ వెలిబుచ్చగలడు. ఇతివృత్తానికి వేరుగా నిలుస్తాడు. దాని ద్వారా నిరుపమాన కళారీతుల సృష్టిస్తాడు. అంతరంగ రోగాల్ని ఇతివృత్తంగా గలిగిన కళాకారుని అంతరంగ రోగి అనుట ''లియరురాజు''ను వ్రాసిన షేక్స్‌పియరును పిచ్చివాడనుటవంటి నిరర్థకపు మాటే అవుతుంది.

దాడులనుభవించడంవల్ల ఇంగ్లాండులోని కళాకారునకు మొత్తం మీద కొంత లాభమే చేకూరింది. అతని వ్యక్తిత్వం గట్టిపడుతుంది. పూర్తిగాతాను తానవుతాడు. ఈ దాడులు మాత్రం చాలా మొరటుగానూ, అసంబద్ధంగానూ, హేయంగానూ ఉంటున్నాయి. అల్ప బుద్ధుల నుండి ఔచిత్యాన్నిగానీ, పట్టణ శివార్లలోని తుక్కుమూకల నుండి ప్రవర్తనా సౌకుమార్యాన్నీ ఎవ్వరూ ఆశించరు కదా! అపక్రమత్వమూ, బుద్ధి మాంద్యమూ ఆధునిక జీవన సరళిలో కొట్టవచ్చినట్లుండే అంశాలు. ఏమనుకున్నా, అవి ఉన్నాయి. నేటి పాత్రికేయులు బహిరంగంలో వ్యతిరేకంగా వ్రాసిన దానికి అంతరంగంగా క్షమాపణ చెప్పుకొంటారని చెప్పినట్లుయిన, వారికి న్యాయం చేకూరుతుంది.

గత రెండు సంవత్సరాలలో కళానిందకై జనసామాన్యాధీనంలో ఉండే శబ్దజ్ఞానానికి మరి రెండు విశేషణములు చేర్చబడినాయి. మొదటి పదం ''అనారోగ్యం'', రెండవ పదం ''దిగుమతి దినుసు''. రెండవ పదం ఉందే అది, చావులేని, పరవశ పరచే అతి సుందర ''ఆర్కిడు''★ పై కుక్కగొడుగు వెళ్ళబోసుకొనే క్షణిక ఉక్రోషంలాంటిది. ఇది అభినందనమే కానీ పనికి మాలిన అభినందన. ''అనారోగ్యం'' అనే పదం మాత్రం విశ్లేషింపదగింది. చాలా ఆసక్తికర పదం. ఇది ఎంత ఆసక్తికరమైందీ అంటే దీనిని వాడేవారికిట్లంటే ఏమో తెలియనంత!


★ ఏకదళ బీజ జాతికి చెందిన పూల మొక్క

దీని అర్థమేమి? ఆరోగ్యకరమైన లేక అనారోగ్యకరమైన కళ ఏది? కళకు అన్వయించే అన్ని మాటలు దాని శైలికో, ఇతివృత్తానికో సంబంధించినవి. శైలి దృష్ట్యా, ఆరోగ్యకరమైన కళ ఏదంటే కళాకారుడు వాడుకొనే వస్తువుల పదాలు కానివ్వండి, రంగులు కానివ్వండి, దంతం కానివ్వండి, వాటిలోని సౌందర్యాను కనుగొని, వానిని రసానందోత్పత్తికి ఆలంబనంగా చేసుకొనేది ఆరోగ్యకరకరళ. ఇతి వృత్త దృష్ట్యా ఇతి వృత్తపు ఎంపిక, కవి మనోధర్మం మీద ఆధారపడి దానినుండే ఫలించేది ఆరోగ్యకరమైన కళ. పరిపూర్ణతా వ్యక్తిత్వం కలదే మొత్తానికి ఆరోగ్యకరమైన కళ. రూపాన్నీ, వస్తువునూ కళ నుండి వేరుచేయలేము. అవి ఎల్లపుడూ ఒకటే. విషయ విశ్లేషణకోసం కళానుభవ సమగ్రతను ప్రక్కకుంచి, మానసికంగా వానిని వేరుచేయవచ్చు. శైలి అందరికీ అప్పుడే తెలిసుండీ, పాతకాలపు వాసన కొడుతూ సామాన్యంగా ఉండేదీ, రచయిత తనకు ఆనందాన్నిచ్చే ఇతివృత్తాన్ని కాక జనసామాన్యం ధనం చెల్లిస్తుందనే ఆసతో ఎన్నికచేసుకొనేది అనారోగ్యకరమైన కళ. నిజానికి ప్రజానీకం చేత ఆరోగ్యకరం అని పిలువబడే జనరంజక నవల తప్పకుండా పూర్తిగా అనారోగ్యకరమైనది. ప్రజానీకం అనరోగ్యకరమైంది అనే నవల తప్పకుండా సుందరమూ, ఆరోగ్యకరమైందీ అయివుంటుంది.

ప్రజానీకమూ, పత్రికలూ ఈ రెండు పదాలను దుర్వినియోగం చేస్తున్నాయి అని నేను ఫిర్యాదు చేయడం లేదని వేఱే చెప్పనక్కరలేదనుకుంటాను. కళ అంటే ఏమో తెలియని వీరు ఆ పదాలను సరియైన అర్థంలో ఉపయోగింపగలరని నేను అనుకోలేను. జరుగుతున్న దురుపయోగాన్ని సూచించుట మాత్రమే చేస్తున్నాను. ఈ దురుపయోగానికి మూలంను సులభంగా వివరించవచ్చు. బర్బరిక భావసరిణి గల అధికారికత నుండి ఇది వస్తుంది. అధికారం మూలాన భ్రష్టమైన సంఘానికి వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవడానికి గానీ, అభినందించడానికి గానీ శక్తి లేక పోవడం వల్లనే ఇది సంభవిస్తుంది. ఒక్క మాటలో చెప్పవలెనంటే ఎడ్డెతనంగలదీ, తెలివి లేనిదీ అయిన ప్రజాభిప్రాయం నుండి ఇది వస్తుంది.

ప్రజాభిప్రాయం క్రియలను అదుపు పెట్టడానికి ప్రయత్నించినపుడు తప్పయినా సదుద్దేశం కలదిగా పరిగణింపవచ్చుగానీ భావాన్నీ, కళనీ అదుపులో పెట్టడానికి చేసే ప్రయత్నం అపప్రథమైంది, దురుద్దేశ పూరితమైంది అని చెప్పనక్కర లేదు.


ప్రజలయభిప్రాయంకంటే, ప్రజల కండబలం గురించే ఎక్కువ అనుకూలంగా చెప్పవచ్చు. రెండవది మంచిదేకావచ్చు. కాని మొదటిది తెలివిలేనిది. బలం సరియైనవాదం కాదంటారు. దేన్ని రుజువు పర్చడానికీ వాదాన్ని ఉపయోగిస్తామో అనేది ముఖ్యం. గత కొన్ని శతాబ్దాలలో ఇంగ్లాండులో వ్యక్తి రాజ్యం. ఫ్రాన్సులో భూస్వామ్యం వంటి అతి ముఖ్య సమస్యలు కండబలం చేత పరిష్కరించ బడ్డాయి. విప్లవంలో ఉండే హింస ప్రజలను శ్రేష్ఠంగానూ, అద్భుతంగానూ కనిపించ జేయవచ్చు. కలం, వఱుపురాయి కంటే బలవంతమయిందనీ ఇటుక పెళ్ళవలె దెబ్బ తీసేందుకు దానిని వాడవచ్చునే విషయం ప్రజలు కనిపెట్టిన రోజు ప్రాణాంతకమైనట్టిది. వెంటనే వారు పాత్రికేయుని వెదికి పట్టుకొని, ప్రోదిచేసి, వానిని కష్టించి పనిచేసే జీతగానిగా చేసి కొన్నారు. వారిద్దరి ( ప్రజ, పాత్రికేయుడు) కోసం విచారపడవలె. అడ్డం అగావు వెనుక ఉన్నతమైందీ, వీరోచితమైందీ చాలానే ఉండవచ్చు. పత్రికలోని ప్రధాన వ్యాసంలో ఏముంటాయి? అవిచార్యమైన అభిప్రాయం, మూర్ఖత, వంచన, వ్యర్థప్రసంగాలు తప్ప! ఇవి నాలుగు కలసి భయంకర శక్తిగా తయారవుతాయి. ఇదీ నవీన అధికారికత ! (సశేషం)





సౌరాష్ట్రలోని పురవీధి

SIMI/ మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd.No.H/SD-15



పోట్రయిట్